www.vibharenews.com

# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY

PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి గురువారం 22 ఏప్రిల్ 2021 సంపుటి : 02 సంచిక : 283 పేజీలు : 4 వెల : రూ 3-00







## మహ్మమారిని జయించడం మన చేతుల్లోనే ఉంది

ఎవరికి వారు తగిన జాగ్రత్తలు పాటిస్తే

కరోనా వ్యాప్తిని నియంత్రించవచ్చు

లాక్‌డౌన్ ఆఖరి అస్త్రం కావాలి

వలస కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వాలు భరోసా కల్పించాలి

వారు స్వస్థలాలకు తరలిపోకుండా రాష్ట్ర ప్రభుత్వాలు చూసుకోవాలి

'మన ముందున్న సవాల్ చాలా పెద్దది

మన దృఢసంకల్పం, ధైర్యం, సన్నద్ధతతో దీన్ని అధిగమించాలి'

ప్రజలనుద్దేశించి ప్రసంగంలో ప్రధానమంత్రి మోదీ



న్యూఢిల్లీ ఏప్రిల్ 21 కోవిడ్-19 కోరలు చాస్తున్న వేళ... మహ్మమా రిని జయించడం మన చేతుల్లోనే ఉందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. లాక్‌డౌన్‌కు పోవాల్సిన పనిలేదని అన్నారు. మైక్రో కంటైన్మెంట్ జోన్లకు పరిమితమై, ఎవరికి వారు తగిన జాగ్రత్తలు పాటిస్తే కరోనా వ్యాప్తిని నియంత్రించవచ్చని పేర్కొన్నారు. తాళం చెవి మన చేతుల్లోనే ఉందని, అనవసరంగా బయటకు వెళ్లకుండా వీలైనంతగా ఇళ్లకు పరిమితమైతే.. లాక్‌డౌన్ పెట్టే పరిస్థితి రాకుండా చూసుకోవచ్చన్నారు. లాక్‌డౌన్ ఆఖరి అస్త్రం కావాలన్నారు.వలస కార్మికులకు భరోసా కల్పించి వారు స్వస్థలాలకు తరలిపోకుండా రాష్ట్ర ప్రభుత్వాలు చూసుకోవాలని కోరారు. వలస కార్మికుల జీవితాలకు, జీవనోపాధికి ఢోకా లేదనే నమ్మకాన్ని రాష్ట్రాలు కల్పించా లన్నారు. వారికి వ్యాక్సినేషన్ హామీ ఇవ్వాలన్నారు. కరోనా విజృం భణ నేపథ్యంలో మంగళవారం రాత్రి ప్రధాని మోదీ దేశ ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. భిన్న రంగాలకు చెందిన నిపుణులు, ప్రజలందరి భాగస్వామ్యంలో సమష్టిగా పోరాడి మరోసారి కరోనాను కట్టడి చేద్దామన్నారు. ఆక్సిజన్, మందుల కొరతను అధిగమించేందుకు కలిసికట్టుగా కృషి చేద్దామని ఫార్మా రంగానికి పిలుపునిచ్చారు.

**దృఢసంకల్పంతో పోరాడుదాం :** కేంద్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలకు వివరిస్తూ...ఆక్సిజన్, టీకాలు, మందుల ఉత్పత్తిని, సరఫరాను పెంచామన్నారు. వచ్చేనెల ఒకటో తేదీ నుంచి 18 ఏళ్ల పైబడిన వారందరికీ వాక్సినేషన్‌కు వీలుకల్పించామన్నారు. ఈ మహమ్మారికి కుటుంబసభ్యులను కోల్పోయిన వారి బాధను తాను అర్థం చేసుకోగలనన్నారు. దేశం కోవిడ్‌పై పెద్ద సమరమే చేస్తోందన్నారు. తొలిదశ తర్వాత పరిస్థితి కుదుటపడిందని అనుకుంటున్న తరుణంలో సెకండ్ వేవ్ తుపాన్‌లా విరుచుకుపడిందన్నారు. 'మన ముందున్న సవాల్ చాలా పెద్దది. మన దృఢసంకల్పం, ధైర్యం, సన్నద్ధతతో దీన్ని అధిగమించాలి' అని దేశ ప్రజలకు మోదీ పిలుపునిచ్చారు. ప్రధాని మోదీ 20 నిమిషాల ప్రసంగంలో... రెండు అంశాలకు అధిక ప్రాధాన్యమిచ్చారు. ఒకటి... దేశవ్యాప్తంగా లాక్‌డౌన్ పెట్టే అవకాశాల్లేవనే విషయాన్ని ప్రస్ఫుటం చేశారు. గతేడాది లాక్‌డౌన్ కారణంగా పరిశ్రమలు మూతపడి మహానగరాల నుంచి వలస కార్మికులు స్వస్థలాలకు వెళ్లిపోవడంతో ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రతికూల ప్రభావం పడిన విషయం తెలిసిందే. రెండు... వలస కార్మికులకు ప్రభుత్వాలు అండగా నిలుస్తాయని చెబుతూ వారిలో భరోసా నింపే ప్రయత్నం చేశారు. ఆర్థిక రంగాన్ని కాపాడటం, ప్రజారోగ్యాన్ని సంరక్షించడం..రెండింటికీ కేంద్రం సమప్రాధాన్యత ఇస్తుందనే సంకేతాలిచ్చారు.

**ఆపరిస్థితి రానీయెద్దు :** 'ప్రస్తుత పరిస్థితుల్లో దేశాన్ని లాక్‌డౌన్ నుంచి కాపాడుకోవాలి. లాక్‌డౌన్‌ను ఆఖరి అస్త్రంగా మాత్రమే వాడాలని రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి?త చేస్తున్నా. లాక్‌డౌన్ దాకా పరిస్థితులు రాకుండా చేయగలినంతా చేయాలి. మైక్రో కంటైన్మెంట్ జోన్లపై దృష్టి పెట్టాలి' అని ప్రధాని అన్నారు. ఢిల్లీ ఇప్పటికే వారం రోజులు లాక్‌డౌన్‌ను ప్రకటించగా, జార్ఖండ్ 22 నుంచి 29 దాకా లాక్‌డౌన్‌ను ప్రకటించింది. భారత్‌లో తయారైన రెండు వ్యాక్సిన్లతో ప్రపంచంలోనే అతిపెద్ద టీకా కార్యక్రమాన్ని చేపట్టామని మోదీ అన్నారు. ప్రపంచంలోనే అత్యంత వేగంగా 12 కోట్ల వ్యాక్సిన్లను వేసింది భారతదేశమేనన్నారు. ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని... అయినా పూర్తి మనోనిబ్బరంతో పోరాడాలన్నారు. దేశప్రజల సమష్టికృషితో కరోనాను జయిస్తామనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు.

**చిన్నారులు చొరవ చూపాలి.. :** 'కోవిడ్‌పై అలుపెరుగని పోరాటం చేస్తున్న వైద్యులు, ఇతర ఆరోగ్య సిబ్బందికి ధన్యవాదాలు తెలుపుతున్నాను. వ్యాక్సిన్ అభివృద్ధి, ఉత్పత్తి, సరఫరాలో ఫార్మా రంగం నిర్విరామంగా శ్రమిస్తోంది. ఆక్సిజన్ సిలిండర్ల కొరత పెద్ద సమస్యగా మారింది. దీన్ని అధిగమించడానికి సంబంధిత వర్గాలు సమష్టిగా కృషి చేస్తున్నాయి. కోవిడ్ తొలివేవ్‌లో పీపీటీ కిట్లు, ఇతర సదుపాయాలు లేవు. చికిత్స నిర్దిష్టంగా తెలియదు. వ్యాక్సిన్లు లేవు... అప్పటితో పోలిస్తే ఇప్పుడు కరోనాను సమర్థంగా ఎదుర్కొనగలిగే స్థితిలో ఉన్నాం' అని ప్రధాని అన్నారు. ప్రజలందరూ కోవిడ్ జాగ్రత్తలను కచ్చితంగా పాటిస్తే లాక్‌డౌన్‌లతో అవసరం ఉండదన్నారు. అనవసరంగా బయటకు రావొద్దని, వ్యాక్సిన్ తీసుకోవాలని ప్రజలను కోరారు. స్వచ్ఛభారత్‌లో పెద్దలకు ఆదర్శంగా నిలిచినట్లే... కోవిడ్‌పై పోరులో కూడా చిన్నారులు ముందుండాలన్నారు. ముఖ్యమైన పని లేకుండా ఇళ్లను వదిలి వెళ్లొద్దని తమ తల్లిదండ్రులను, పెద్దలను పిల్లలు ఒప్పించాలన్నారు.


## కౌంటింగ్ పై 23న విచారణ

విజయవాడ, ఏప్రిల్ 21,( విభారె ప్రతినిధి) ఏపీ జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల ఫలితాలపై సస్పెన్స్ కొనసాగుతోంది. ఈ ఎన్నికలకు సంబంధించి దాఖలైన పిటిషన్లపై ఈ నెల 23 (శుక్రవారం) విచారణ చేపడతామని హైకోర్టు తెలిపింది. మంగళవారం కోర్టు ప్రారంభమైన వెంటనే ఎస్ఈసీ తరఫు లాయర్ స్పందించారు. విచారణను కోర్టు ఈ నెల 19కి వాయిదా వేసిందని.. అయితే కోర్టు ఆదేశాల మేరకు పిటిషన్లు లిస్ట్ కాలేదన్నారు. పిటిషన్లపై అత్యవసరంగా విచారణ చేపట్టాలని కోరగా.. న్యాయమూర్తి శుక్రవారం పిటిషన్లపై విచారణ జరుపుతామన్నారు.ఈ నెల 1న జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకు ఎస్ఈసీ షెడ్యూల్ ప్రకటించింది. ఈ నెల 8న పోలింగ్, 10న ఫలితాలు వెల్లడించాలని నిర్ణయించారు. ఈ క్రమంలో ఈ నెల 6న హైకోర్టు సింగిల్ బెంచ్ స్టే ఇచ్చింది. హైకోర్టులో విచారణ సందర్భంగా సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు 4 వారాల ఎన్నికల కోడ్ విధించలేదని పిటిషనర్లు వివరించారు. 7 రోజుల్లో ఎలా ఎన్నికలు నిర్వహిస్తారని ప్రశ్నించారు. ఈ వాదనలతో ఏకీభవించిన హైకోర్టు.. ఎన్నికల నోటిఫికేషన్‌పై స్టే విధించింది. మంగళవారం సింగిల్ బెంచ్ ఇచ్చిన తీర్పును ఎస్ఈసీ డివిజన్ బెంచ్‌లో సవాల్ చేసింది.ఈ నెల 7న సింగిల్ జడ్జి ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వుల్ని డివిజన్ బెంచ్ కొట్టేసింది.. ఈ సమయంలో జోక్యం చేసుకోలేమని ధర్మాసనం చెప్పింది. తదుపరి ఆదేశాలు ఇచ్చే వరకూ ఫలితాలను మాత్రం వెల్లడించొద్దని




సూచించింది. సింగిల్ బెంచ్ జడ్జి ఇచ్చే తీర్పుకు లోబడి ఉండాలని ఆదేశించింది. ఈ నెల 8న పోలింగ్ జరగ్గా.. ఫలితాలు వాయిదా పడ్డాయి. ఎన్నికల కౌంటింగ్‌పై హైకోర్టులో ఈ నెల 15న విచారణ జరగ్గా.. ఎస్ఈసీ మూడు పిటిషన్లలో రెండింటింకి మాత్రమే కౌంటర్ దాఖలు చేసింది.. మూడో పిటిషన్ కౌంటర్ దాఖలుకు సమయం కోరింది. దీంతో హైకోర్టు తదుపరి విచారణను ఈ నెల 19కు వాయిదా వేసింది. మళ్లీ కోర్టులో ఆ పిటిషన్‌పై మంగళవారం విచారణ జరిగింది.. మళ్లీ శుక్రవారానికి వాయిదా పడింది.

## ఏపీలో కఠిన ఆంక్షలు



విజయవాడ, ఏప్రిల్ 21, కరోనా వణికిస్తోంది. రోజు, రోజుకు కేసులు పెరిగిపోతున్నాయి.. దీంతో జగన్ సర్కార్ వైరస్ కట్టడికి చర్యలు ప్రారంభించింది. సోమవారం హై లెవల్ మీటింగ్ నిర్వహించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్.. కొన్ని ఆంక్షల్ని విధించాలని నిర్ణయించారు. ఈ మేరకు = సీఎస్ ఆదిత్యనాథ్ దాస్ ఉత్తర్వులు జారీ చేశారు. నిబంధనలు అమలు చేయడానికి జిల్లా కలెక్టర్లకు పూర్తి అధికారాలు ఇచ్చారు.కరోనా ప్రభావం పెరగడంతో మాస్క్ తప్పనిసరి చేసింది ప్రభుత్వం. మాస్కు లేకుండా ఎవరైనా బయట తిరిగితే.. వారికి రూ.100 జరిమానా విధించాలని ప్రభుత్వం నిర్ణయించింది. రోడ్డుపైకి ఎవరైనా మాస్కు లేకుండా వస్తే జరిమానా విధించాలని పోలీసులను ఆదేశించారు. అప్పటికీ మార్పు రాకపోతే కేసు నమోదు చేస్తామని హెచ్చరిస్తున్నారు. బయటకు వచ్చే సమయంలో ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా మాస్క్ ధరించాలని.. లేకపోతే చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరిస్తున్నారు.ఇక రాష్ట్రవ్యాప్తంగా షాపులు, వ్యాపార సంస్థలు, కమర్షియల్ కాంప్లెక్సుల్లో 5 అడుగుల భౌతిక దూరం పాటించేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశించింది. షాపింగ్ మాల్స్, సినిమా హాళ్లు వంటి చోట సీటు మార్చి సీటు అంటే మధ్యలో సీటు ఖాళీగా ఉండేలా చూడాల్సిందే. ప్రతి షాపులో, ఇతర చోట్లా శానిటైజర్ వేసుకున్న తర్వాతే వినియోగదారులను లోపలికి పంపించాలని ఆదేశించారు. థర్మల్ స్క్రీనింగ్ మెషీన్లను విధిగా ఉపయోగించాలి. స్విమ్మింగ్ పూల్స్ అన్నీ వెంటనే మూసివేయాలని ఆదేశాలిచ్చారు. తప్పనిసరిగా ఈ నిబంధనల్ని పాటించాలని అధికారులు సూచిస్తున్నారు.. లేకపోతే చర్యలు తప్పవని హెచ్చరిస్తున్నారు

## వ్యాక్సిన్ పాలసీ నోట్లరద్దు లాంటిదే..



దిల్లీ: కరోనాపై పోరులో భాగంగా మే 1 నుంచి వ్యాక్సిన్ల కొనుగోలు విధానంలో పలు మార్పులు చేస్తూ కేంద్రం తీసుకున్న నిర్ణయంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ మండిపడ్డారు. నూతన వ్యాక్సిన్ పాలసీ.. నాలుగేళ్ల క్రితం ప్రకటించిన నోట్లరద్దు లాంటిదేనని పేర్కొన్న రాహుల్.. ఇది పూర్తిగా వివక్షపూరితమైన, అసమానత విధానం అని దుయ్యబట్టారు."కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న వ్యాక్సిన్ పాలసీ.. నోట్లరద్దు కంటే తక్కువేమీ కాదు. సామాన్య ప్రజలు క్యూలైన్లలో నిల్చుంటారు. ఆరోగ్యం, ఆస్తులు, చివరకు ప్రాణాలు కూడా కోల్పోతారు. అంతిమంగా కొద్దిపాటి బడా పారిశ్రామికవేత్తలు ప్రయోజనం పొందుతారు" అని రాహుల్ ట్విటర్ వేదికగా ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు.రాహుల్ మంగళవారం కరోనా బారిన పడ్డారు. స్వల్ప లక్షణాలు కన్పించడంతో పరీక్షలు చేయించుకోగా పాజిటివ్‌గా నిర్ధారణ అయనట్లు ఆయన నిన్న ప్రకటించారు. ప్రస్తుతం హోం ఐసోలేషన్‌లో ఉన్నారు.వ్యాక్సిన్ కొనుగోలులో రాష్ట్రాలకు స్వేచ్ఛ కల్పిస్తూ కేంద్రం గత సోమవారం నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. టీకా తయారీదారులు... 50% ఉత్పత్తిని నేరుగా రాష్ట్ర ప్రభుత్వాలకు సరఫరా చేయడానికి అనుమతి కల్పించింది. అంతేగాక, 18ఏళ్ల పైబడిన వారందరూ మే 1 నుంచి టీకాలు తీసుకోవచ్చని స్పష్టం చేసింది.

## పులకించిన భద్రాద్రి



ఖమ్మం, ఏప్రిల్ 21, (( విభారె ప్రతినిధి) ఖమ్మం జిల్లా భద్రాచల క్షేత్రంలో ఇవాళ శ్రీరామనవమి పర్వదినాన శ్రీ సీతారాముల కళ్యాణం కన్నుల పండువగా జరిగింది. సరిగ్గా మధ్యాహ్నం పన్నెండు గంటలకు అభిజిత్ లగ్నంలో శ్రీరాముల వారిచే అమ్మవారి తలపై జిలకర్ర, బెల్లంపెట్టించారు.అనంతరమాంగళ్యధారణ కార్యక్రమం జరిగింది. ఈ కమనీయ వేడుకను కరోనా మహమ్మారి కారణంగా భక్తజనుల సందడి లేకుండానే నిర్వహించారు. కోవిడ్ నిబంధనల నడుమ భద్రాచల క్షేత్రంలో శ్రీ సీతారాముల కల్యాణం కన్నుల పండువగా జరిగింది. అభిజిత్ లగ్నంలో సీతారాముల కల్యాణ వేడుక కమనీయంగా సాగింది. సరిగ్గా పన్నెండు గంటలకు జిలకర్ర, బెల్లం పెట్టారు.అనంతరంమాంగళ్యధా రణజరిగింది. ఈ కమనీయ వేడుకను అశేష జనవాహిని పలు తెలివిజన్ల ద్వారా వీక్షించారు. సీతారాములకల్యాణాన్నిగాంచినరామ భక్తులు ఆనంద పారవశ్యంలో మునిగితేలా రు.భద్రాచలంలో ఉదయం 10:30 గంటలకు రాములోరి కళ్యాణ మహోత్సవం ప్రారంభమయ్యింది. మధ్యాహ్నం 12:30 గంటల వరకు ఈ కళ్యాణోత్సవ కార్యక్రమం నిర్వహించారు. రాములోరి కల్యాణానికి తెలంగాణ ప్రభుత్వం తరఫున పట్టు వస్త్రాలను ముత్యాల తలంబ్రాలను మంత్రులు ఇంద్రకరణ్ రెడ్డి, పువ్వాడ అజయ్ కుమార్ దంపతులు సమర్పించారు.నివారణ చర్యల నేపథ్యంలో ఈ ఏడాది కూడా సీతారాముల కల్యాణాన్ని కొద్దిమంది పురోహితులు, అతికొద్ది అతిథుల సమక్షములో నిర్వహించారు. కల్యాణ ఘట్టంలో కొందరు అర్చకులు రామయ్య తరఫున.. మరికొందరు అర్చకులు సీతమ్మ తరఫున ప్రతినిధులుగా వ్యవహరించి ఎదుర్కోలు ఉత్సవాన్ని కనుల పండువగా జరిపారు.కరోనా మహమ్మారి వల్ల భక్తజనుల సందడి లేకుండానే కల్యాణ వేడుకలను నిర్వహించారు. ఇవాళ కల్యాణం ముగియడంతో రేపు శ్రీరామచంద్రుడి పట్టాభిషేక మహోత్సవ కార్యక్రమం జరగనుంది. మరోవైపు కరోనా కారణంగా ఆలయంలో పూజలు, తీర్థ ప్రసాదాలు నిలిపివేశారు .రాములోరి కళ్యాణానికి ప్రభుత్వం తరపున పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను మంత్రులు ఇంద్రకరణ్ రెడ్డి, పువ్వాడ అజయ్ కుమార్ దంపతులు సమర్పించారు. ఎమ్మెల్సీ బాలసాని, " అనిల్ కుమార్ దంపతులు, పాల్గొన్నారు.

## ఉద్యోగ సాధన రిలే నిరాహార దీక్షలు వాయిదా: షర్మిల

హైదరాబాద్:( విభారె ప్రతినిధి) కోవిడ్ సెకండ్ వేవ్ విస్తృతి నేపథ్యంలో ఉద్యోగ సాధన రిలే నిరాహార దీక్షలు తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు వైఎస్ షర్మిల పేర్కొంది. నూతన తెలంగాణ రాష్ట్రంలో కొలువులు వస్తాయని ఎంతో ఆశతో ఎదురు చూసిన యువత గత ఆరేళ్ల కాలంలో పాలకులు కొలువులు ఇవ్వక నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ప్రాణాలు తీసుకుంటుంటే హృదయం ఉన్న ప్రతి ఒక్కరిలో ఆవేదన కలుగుతుందని ఆమె తెలిపారు. పాలకులు మాత్రం బండరాయి లాగా కదలక మెదలక యువత ప్రాణాలు కోల్పోతుంటే చోద్యం చూస్తున్నారని షర్మల మండిపడ్డారు. కొలువుల రాక అల్లాడుతూ ప్రాణాలు కోల్పోతున్న యువత బాధలకు చలించి వారికి భరోసా కల్పించాలని ఉద్యోగ సాధన దీక్ష చేపట్టామన్నారు. నిర్బంధాలను తట్టుకొని పోరాడుతున్నామని, కొలువులు సాధించే వరకు ఈ పోరాటం ఖచ్చితంగా కొనసాగిస్తామని షర్మిల పేర్కొంది.కరోనా సెకండ్ వేవ్ ఉద్ధృతంగా వ్యాపిస్తున్న నేపథ్యంలో తమ కార్యకర్తల, ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని బాధ్యత కలిగిన నాయకురాలిగా కొలువుల సాధన దీక్షలను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నామని షర్మిల వెల్లడించింది. కొలువుల సాధన కోసం జరిగే తమ ఈ పోరాటం నోటిఫికేషన్లు వచ్చేంతవరకు కొనసాగిస్తామని పేర్కొంది. కరోనా సెకండ్ వేవ్ తగ్గిన తర్వాత తిరిగి తమ పోరాటాన్ని కొనసాగిస్తామని ఆమె తెలిపింది.కార్యకర్తలకు, వైఎస్సార్ అభిమానులు, తెలంగాణ ప్రజలందరూ మాస్కులు వాడాలని, చేతులను నిరంతరం శానిటైజ్ చేసుకోవాలని, భౌతిక దూరం పాటిస్తూ కరోనా నుంచి దూరంగా ఉంటూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని షర్మిల విజ్ఞప్తి చేశారు. కరోనాతో బాధపడుతూ క్వారంటైన్‌లో ఉన్న వాళ్లందరూ బెదిరి పోకుండా ధైర్యంగా ఎదుర్కోవాలని ఆమె అన్నారు.




# సంపాదకీయం

గురువారం 22 ఏప్రిల్ 2021

## ప్రైవేట్ పై నిఘా... తప్పనిసరి

ఒకవైపు ప్రజల ప్రాణాలు గాలిలో కలుస్తుంటే మరోవైపు వైద్యరంగంలో యథేచ్ఛగా దోపిడీ సాగుతోంది. కరోనా తొలిదశలో ప్రభుత్వ ఆసుపత్రులు మాత్రమే చికిత్స అందించాయి. క్రమేపీ ప్రయివేటు వైద్యాన్ని అనుమతించారు. రోగి ఆర్థిక స్తోమతను అనుసరించి లక్షల రూపాయల్లోనే దండుకున్నారు. అనేక అవకతవకలు, అక్రమాలు, చికిత్సల పరంగా లోపాలు సైతం చోటు చేసుకున్నాయి. అయినప్పటికీ ప్రజలు సహించారు. వైద్యం అంటే విశ్వాసం. తమకు ఏరకమైన వైద్యం అందుతుందో తెలియదు. ఎందుకు స్థాయిని మించి స్టెరాయిడ్స్ ఎక్కిస్తున్నారో సామాన్యునికి అర్థం కాదు. అయినప్పటికీ వేరే గత్యంతరం లేక భరించాల్సి వచ్చింది. ప్రభుత్వాలకు బోలెడంత అనుభవం వచ్చింది. ప్రజలకూ కరోనా తో సహజీవనం తెలిసొచ్చింది. రెండో దశలో ఇప్పుడు కరోనా విరుచుకు పడుతోంది. ప్రజల ఆర్థిక స్థితిగతులు మరింతగా చితికిపోయి ఉన్నాయి. ప్రయివేటు ఆసుపత్రుల దోపిడీ ఏ తీరుగా సాగుతుందో ప్రభుత్వానికీ స్పష్టంగా తెలుసు. అయినా నిరోధక చర్యలు లోపించాయి. ఫలితంగా గతంలో కంటే ఈ విడత మరింతగా రోగుల దోపిడీ సాగుతోందని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వీటిని నియంత్రించేందుకు చట్టపరమైన చర్యలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూనుకోకపో వడం విషాదం. నామమాత్రపు హెచ్చరికలే తప్ప ఆసుపత్రు లను తనిఖీలు చేసి, రోగులకు వేస్తున్న బిల్లులపై నిఘా పెట్టడం లేదు.కరోనాకు సంబంధించి కేంద్రం బాధ్యత చాలా కీలకమై నది. లాక్ డౌన్ లు, నియంత్రణలే కాదు. ఏ వయసు వారికి వ్యాక్సిన్ ఇవ్వాలనే అంశాలనూ , సరపరాను కేంద్రమే నియం త్రిస్తోంది. నిర్దిష్టమైన ఛార్జీలను మాత్రం కేంద్రం సూచించడం లేదు. సగటు మనిషి లక్షల రూపాయలు వైద్యానికి వెచ్చిం చలేడు. ఫీజుల విషయంలో నిర్దిష్ట పరిమితి దాటిన తర్వాత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల యంత్రాంగాలు ఆయా ఆసుపత్రులకు కళ్లెం వేయాలి. ఆరోగ్య అత్యవసర పరిస్థితిలో ప్రయివేటు ఆసుపత్రులు ధనార్జన కు ప్రయత్నించడం వృత్తి నియమాలకే సిగ్గు చేటు. అయితే అందివచ్చిన అవకాశాన్ని ఎవరూ విడిచిపె ట్టడం లేదు. నిన్నామొన్నటి వరకూ చికిత్సకు వినియోగించే రెమ్ డెసివర్ మందు అయిదు వేల నుంచి 15వేల రూపాయల వరకూ విక్రయించారు.తాజాగా కంద్రంజోక్యంతో దాని ధర కంపెనీలను బట్టి తొమ్మిది వందల రూపాయల వరకూ దిగివచ్చింది. ప్రకటన అయితే కంపెనీలు చేశాయి. అయితే ఆచరణలో దీనిని ఎంతవరకూ అమలు చేస్తాయెా వేచిచూడాలి.ఆసుపత్రులు,ఫార్మాకంపెనీలు,డిస్ట్రిబ్యూటర్లు కలిపి సామాన్యుని జేబుకు చిల్లు పొడుస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. సిండికేట్ గా మారితే మాత్రం నియంత్రిత ధరలను అమలు చేయడం సాధ్యం కాదు. కేవలం కాగితాలకే తగ్గింపు ధరలు పరిమితమవుతాయి. దీనిపై కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టి పెట్టాలి. అత్యధికంగా రెమ్ డెసివర్ పేరుతోనే ఆసుపత్రులు అధిక చార్జీలకు తెర తీస్తున్నాయి.అప్పుడప్పుడు మంత్రులు, అధికారులు హెచ్చరికలు జారీ చేస్తున్నారు. దోపిడీని సహించమంటూ మాటవరస హుంకరింపులు వినిపిస్తున్నారు. ప్రయివేటు ఆసుపత్రులను సందర్శించి , అక్కడ అందుతున్న చికిత్స వివరాలు తెలుసుకుంటున్న దాఖలాలు లేవు. బాధిత కుటుంబాలు రుణాల ఊబిలో కూరుకుపోతూ ఏ మేరకు ఛార్జీలు చెల్లిస్తున్నాయో తెలుసుకోవడం లేదు. అసలు ఇటువంటి తీవ్ర రుగ్మతల విషయంలో ప్రజారోగ్యానికి పూర్తి పూచీకత్తు ప్రభుత్వాలే వహించాలి. ప్రయివేటు ఆసుపత్రుల ఫీజులుసైతం సర్కారే చెల్లించాలి. కరోనా సేవలకు నిర్దేశిత రుసుమును మాత్రమే విధించేలా చూడాలి. నిజానికి నూటికి తొంభై అయిదు శాతం కేసులు హోమ్ ఐసోలేషన్ తోనే నయమవుతాయనేది ప్రపంచ ఆరోగ్య సంస్థ లెక్క. కానీ రకరకాల భయాల కారణంగా ప్రజలు ఎగబడుతున్నారు. ఎవరిని ఆసుపత్రుల్లో చేర్చుకోవా లనే దానిపై నియంత్రణ లేదు. డబ్బులు చెల్లించే స్తోమత ఉంటే చాలు ప్రయివేటు ఆసుపత్రులు అడ్మిసన్లు ఇచ్చేస్తున్నాయి. ప్రతి ప్రయివేటు ఆసుపత్రిని రెవిన్యూ, మునిసిపల్ యంత్రాం గం పరిధిలోకి తెచ్చి ఫీజులు, అడ్మిషన్ల విషయంలో అదుపు చేయడం తక్షణ అవసరంగా కనిపిస్తోంది. ఐఏఎస్, ఐపీఎస్ వంటి ఉన్నతాధికారుల పర్యవేక్షణలో ప్రయివేటు ఆసుపత్రుల యాజమాన్య పద్ధతులపై నిఘా పెట్టాలి.దేశంలో అందరికీ వాక్సిన్ లభించి భద్రతతో కూడిన, భరోసాతో నిండిన సాధారణ జీవనం ఇప్పట్లో లభించేలా కనిపించడం లేదు. ఇప్పటికే ఒక డోసు వాక్సిన్ ఇచ్చిన వారికి రెండో డోసు ఇవ్వడానికే వెదుకులాట కొనసాగుతోంది. 45 సంవత్సరాలు పైబడిన వారికి వాక్సిన్ ఇస్తామన్న ప్రభుత్వ హామీ పూర్తి కావడానికి ఎంతకాలం పడుతుందో చెప్పలేం. యూనివర్శల్ వాక్సినేషన్ చేసేందుకు అవసరమైనన్ని యూనిట్లు మన వద్ద లేవు. ఉత్పత్తి చేయాలంటే కూడా రెండు సంవత్సరాల వరకూ పట్టవచ్చంటున్నారు. తొలిదశలో క్రమేపీ తగ్గుముఖం పట్టినట్లే మలి విడత విజృంభణ కూడా సహజమైన విధానంలోనే కనుమరుగు కావచ్చు. అంతవరకూ జాగ్రత్తగా ఉండటమే అత్యుత్తమం. ప్రభుత్వాలు అంతవరకూ ప్రజల ఆర్థిక భద్రతకు సైతం భరోసాను ఇవ్వాలి. మెడికల్ మాపియా కట్టుతప్పకుండా తన ప్రజలను వారి నుంచి కాపు కాచుకోవాలి. లేకపోతే భయాందోళనలను మరింతగా నగదుగా మార్చుకునేందుకు తెగిస్తాయి.

## కరోనా సింప్టమ్స్ మారుతున్నాయ్




ముంబై, ఏప్రిల్ 21, (న్యూస్ పల్స్)నదేశంలో కరోనా ఫస్ట్ వేవ్ తో పోలిస్తే ప్రస్తుత సెకండ్ వేవ్ లో సింప్టమ్స్ తీరు వేరుగా ఉందని సోమవారం ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ఐసీఎంఆర్) డైరెక్టర్ జనరల్ డాక్టర్ బలరాం భార్గవ చెప్పారు. ఫస్ట్ వేవ్ కు, సెకండ్ వేవ్ కు సింప్టమ్స్ విషయంలో స్పష్టమైన మార్పు కన్పిస్తోందన్నారు. ఫస్ట్ వేవ్ లో కరోనా బారిన పడినవారికి జ్వరం,పొడి దగ్గు, బాడీ పెయిన్స్, కీళ్ల నొప్పులు, అలసట, వాసన తెలియకపోవడం, గొంతు నొప్పి, శ్వాస ఇబ్బంది వంటి సింప్టమ్స్ ఎక్కువగా కన్పించాయని, ఇప్పుడు శ్వాస ఇబ్బందే బాగా కన్పిస్తోందన్నారు. దీనివల్ల సెకండ్ వేవ్ లో కరోనా పేషెంట్లకు ఆక్సిజన్ అవసరం విపరీతంగా పెరిగిందని తెలిపారు. ఫస్ట్ వేవ్ కు, ఇప్పటికి డెత్ రేట్ లో పెద్దగా మార్పు లేదన్నారు. రాష్ట్రాల్లో హాస్పిటళ్లలో చేరిన 10 వేల మంది కరోనా పేషెంట్ల డేటా ఆధారం గా ఈ అంచనా వేశామన్నారు. సెకండ్ వేవ్ లో కేసుల పెరుగుద లకు డబుల్ మ్యుటెంట్ కరోనానే కారణమా? అన్నది ఇంకా నిర్ధారణ కాలేదన్నారు.ఫస్ట్ వేవ్ లో 0 నుంచి 19 ఏళ్ల మధ్య వారిలో ఇన్ఫెక్షన్ రేటు 5.8 శాతం ఉండగా, ఇప్పుడు 4.2 శాతం ఉందని బలరాం భార్గవ చెప్పారు. 20 నుంచి 40 ఏళ్ల ఏజ్ గ్రూపులో ఇన్ఫెక్షన్ రేటు అప్పుడు 25 శాతం ఉండగా, ఇప్పుడు కొంచెం తక్కువగా 23 శాతం ఉందన్నారు. రెండు వేవ్స్ లోనూ కరోనా బారిన పడినవారిలో 40 ఏళ్లకు పైబడినవాళ్లే 70 శాతం ఉన్నారని తెలిపారు.ఫస్ట్ వేవ్ లో యావరేజ్ గా 50 ఏండ్ల వారికి కరోనా బాగా సోకిందని, సెకండ్ వేవ్ లోనూ యావరేజ్ గా 49 ఏండ్ల వయసు వారికి ఎక్కువగా వ్యాపిస్తోందన్నారు. ప్రస్తుత వేవ్ లోనూ వృద్ధులకు ప్రమాదం ఎక్కువే ఉందన్నారు. ప్రస్తుతం అసింప్టమాటిక్, స్వల్ప అనారోగ్యం బారిన పడిన కరోనా పేషెంట్లు ఇంటి వద్దే జాగ్రత్తలు తీసుకుంటే సరిపోతుందని చెప్పారు. ఆర్టీ పీసీఆర్ పద్ధతి బెస్ట్ అని, దీనితో ఎలాంటి కరోనా మ్యుటెంట్ ను అయినా కచ్చితంగా గుర్తించొచ్చని స్పష్టం చేశారు. అయితే కరోనాపై పోరాటంలో ప్రజలు తీవ్ర నిర్లక్ష్యం చూపుతున్నారని, తగిన జాగ్రత్తలు పాటించడం లేదని అభిప్రాయపడ్డారు.

## యాక్టివ్ పాలిటిక్స్ లోకి చిన్నమ్మ



చెన్నై, ఏప్రిల్ 21, (న్యూస్ పల్స్) తమిళనాడు రాజకీయాల్లో తిరిగి యాక్టివ్ కావాలని శశికళ భావిస్తున్నారు. ఈ మేరకు తన అనుచరులకు సంకేతాలు ఇచ్చినట్లు తెలిసింది. తాను రాజకీయ సన్యాసం చేస్తున్నట్లు ప్రకటించినా తనపై కక్ష సాధింపు చర్యలు ఆగకపోవడంతో శశికళ తిరిగి పాలిటిక్స్ లో యాక్టివ్ కావాలని నిర్ణయించుకున్నారు. జైలు నుంచి విడుదలయ్యాక శశకళ అకస్మాత్తుగా తాను రాజకీయాల నుంచి వైదొలుగుతున్నట్లు ప్రకటించిన సంగతి తెలిసిందే.రాజకీయాల నుంచి వైదొలిగినా శశికళ అన్నాడీఎంకే కు ఓటువేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. దీంతో ఆమె అన్నాడీఎంకేను వదులుకోవడానికి ఇష్టపడటం లేదని అర్ధమయింది. మే 2వ తేదీ తర్వాత శశికళ తన రాజకీయ భవిష్యత్ ను ప్రకటించే అవకాశముందంటున్నారు. ప్రస్తుతమున్న పరిస్థితుల్లో అన్నాడీఎంకే అధికారంలోకి రావడం కష్టమే. పవర్ లోకి రాకపోతే పళనిస్వామి, పన్నీర్ సెల్వంల నాయకత్వంపై క్యాడర్ లోనూ, నేతల్లోనూ అనుమానం బయలుదేరుతుంది.అనుమానాలను తనకు అనుకూలంగా మలచుకోవడానికి ప్రయత్నించాలని శశికళ డిసైడ్ అయ్యారు. అన్నాడీఎంకే ను తిరిగి తన అధీనంలోకి తెచ్చుకునేందుకు కూడా శశికళ ప్రయత్నాలు మొదలు పెడతారంటున్నారు. బీజేపీ కూడా శశికళకు మద్దతిచ్చే అవకాశాలు కన్పిస్తున్నాయి. పళనిస్వామి, పన్నీర్ సెల్వంల మధ్య సయోధ్య కుదర్చిని బీజేపీ శశికళ రాకను కూడా స్వాగతించింది. కానీ పళనిస్వామి అంగీకరించకపోవడంతో బీజేపీ పెద్దల సూచనల మేరకే ఆమె రాజకీయాల నుంచి వైదొలిగినట్లు ప్రచారం జరుగుతోంది.ఎన్నికల వేళ తన ఓటును తొలగించడం వెనక కూడా పళనిస్వామి హస్తం ఉందని శశికళ వర్గీయులు ఆరోపిస్తున్నారు. కావాలనే తన పేరును ఓటర్ల జాబితా నుంచి తొలగించారని శశికళ కసితో రగిలిపోతున్నారు. ఈ పరిణామం తర్వాతనే శశికళ ఆలోచనలో మార్పు వచ్చిందంటున్నారు. ఎన్నికల ప్రక్రియ ముగిసిన తర్వాత ముఖ్యులతో శశికళ సమావేశం కావడంతో ఈ ప్రచారానికి మరింత బలం చేకూరినట్లయింది. మొత్తం మీద శశికళ అన్నాడీఎంకే అధినేత్రిగా మారేందుకు సిద్ధమవుతున్నారు. మరి ఏం జరుగుతుందో చూడాలి.

## నేతలు పట్టించుకోవడం లేదు...

నెల్లూరు, ఏప్రిల్ 21, (న్యూస్ పల్స్) ప్రస్తుతం టీడీపీ పరిస్థితి దారుణంగా ఉంది. స్థానిక ఎన్నికల్లో పార్టీ ఘోరంగా ఓడిపోయింది. ఇప్పుడు పరిషత్ ఎన్నికల నుంచి పార్టీ తప్పుకోవాలని.. చంద్రబాబు పిలుపునిచ్చారు. అయినప్పటికీ.. కొందరు నాయకులు మాత్రం పరువు పేరుతో ఎన్నికల బరిలో నిలిచారు. అయితే.. ఈ క్రమంలో పార్టీ నుంచి ఆర్థికంగా వీరికి సహకారం కరువైంది. నిజానికి స్థానిక ఎన్నికల్లో చంద్రబాబు చాలా మందికి సాయం చేయాలని.. పిలుపునిచ్చారు. అంతర్గత చర్చల్లో నేతలకు ఈ విషయాన్ని నూరిపోశారు. అయితే.. చంద్రబాబు చెప్పినప్పుడు.. సరే.. అన్న నాయకులు తీరా ఎన్నికల విషయానికి వచ్చే సరికి.. మాత్రం ఎవరికి వారు తప్పుకొన్నారు.నిజానికి చంద్రబాబు చెప్పినవారిలో మాజీ మంత్రులు, ఆర్థికంగా బలంగా ఉన్నవారే ఉన్నారు. కానీ, వారెవరూ కూడా స్పందించలేదు. వీరు స్పందించి.. నేతలకు ఆర్థికంగా అంతో ఇంతో సాయం చేసి ఉంటే.. పార్టీ కొన్ని చోట్ల అయినా గెలుపు గుర్రం ఎక్కేదనే విశ్లేషణలు వస్తున్నాయి. పంచాయతీ ఎన్నికల్లో పార్టీకి పట్టున్న కొన్ని నియోజకవర్గాల్లో 30 శాతం సీట్లు గెలుచుకుంది. అదే పార్టీ నుంచి ప్రతి నియోజకవర్గానికి ఎంతో కొంత సాయం అంది ఉంటే మరో 10 ? 15 శాతం పంచాయతీలు అదనంగా గెలిచి ఉండేవాళ్లమని పలువురు ఇన్‌చార్జ్‌లు అదిష్టానం ముందు ఆవేదన వ్యక్తం చేశారు.ఈ క్రమంలో ఇప్పుడు పరిషత్ ఎన్నికల్లోనూ ఎవరూ ముందుకు రారని ఊహించే చంద్రబాబు తప్పుకొన్నారని సీనియర్ల నుంచి వాదన ఉంది. ఆర్థికంగా చాలా మంది గత చంద్రబాబు హయాంలో సంపాయించుకున్నారు. కాంట్రాక్టులు, వివిధ రూపాల్లో ఆర్థిక లావాదేవీలు జరిపిన వారు బాగానే పోగేసుకున్నారు. పెట్టుబడులు పెట్టి లాభించారు. కానీ, ఇప్పుడు వారు వెనుకడుగు వేస్తున్నారు. అయితే.. వీరికి టీడీపీపై ప్రేమ లేదని కాదు.. కానీ.. అధికార పార్టీ విషయంలో వారు ఒక అంచనాకు వచ్చారు. వైసీపీ ఇప్పుడున్న పరిస్థితిలో ఏపార్టీ కూడా దానిని ఎదుర్కొనే పరిస్థితి లేదని టీడీపీలో ఆర్థికంగా బలంగా ఉన్న వారు నమ్ముతున్నారు.పైగా స్థానిక ఎన్నికల్లో గెలిచినా.. సంపాయించుకునే మార్గాలు కూడా ఉండవు. సో.. ఇప్పుడు డబ్బులు పంచేసి.. చేతులు ఎత్తేయడం కన్నా.. మౌనంగా ఉండడమే మేలని చాలా మంది మాజీ మంత్రులు, ఎంపీలుసైతం తలపోసినట్టు చంద్రబాబుకు తెలిసింది. అయితే.. వీరి ఆలోచన మంచిదే అయినా.. టీడీపీని నిలబెట్టాల్సిన అవసరం కూడా ఉందనేది పార్టీ నేతల మాట. కానీ, ఇప్పుడు ఎవరూ ఎవరి మాటా వినిపించుకునే పరిస్థితి లేదు. వచ్చే ఎన్నికల నాటికి పరిస్థితి ఏదైనా మారితే.. అప్పుడు వీరంతా సహకరించే అవకాశం ఉంటుందని అంటున్నారు.

## పళని స్వామి సక్సెస్ రేటు బానే ఉంటుంది...



చెన్నై, ఏప్రిల్ 21, (న్యూస్ పల్స్) పళనిస్వామి ప్రస్తుతం తమిళనాడు ఆపద్ధర్మ ముఖ్యమంత్రి. ఎన్నికల ఫలితాలు వెలువడే వరకూ ఆయన ముఖ్యమంత్రి పదవిలో కొనసాగుతారు. పోలింగ్ తర్వాత వస్తున్న విశ్లేషణల ప్రకారం అన్నాడీఎంకే ఈసారి అధికారంలోకి రావడం కష్టమే. తమిళనాడు వ్యాప్తంగా ప్రజలు డీఎంకే వైపు మొగ్గు చూపారంటున్నారు. సినిమా తారల నుంచి సామాన్యుల వరకూ ఈసారి డీఎంకేకు ఒక్క చాన్స్ ఇవ్వాలని భావించడంతో పళనిస్వామి పక్కకు తప్పుకోవడం అనివార్యమని ఆ పార్టీ నేతలు కూడా అంగీకరిస్తున్నారు.పళనిస్వామి కింది స్థాయి నుంచి వచ్చిన నేత. జయలలిత మెప్పు పొంది ఆయన పదవులు పొందారు. జయలలితకు నమ్మకమైన నేతగా గుర్తింపు పొందారు. అదే సమయంలో కీలకంగా ఉన్న శశికళ పట్ల సయితం పళనిస్వామి భక్తి శ్రద్ధలు కనపర్చారు. దాని ఫలితమే పన్నీర్ సెల్వం స్థానంలో పళనిస్వామి ముఖ్యమంత్రి కాగలిగారు. అయితే పళనిస్వామి తాను ఫెయిల్యూర్ ముఖ్యమంత్రిని కాదని నిరూపించుకోగలిగారు. నాలుగేళ్ల పాటు తమిళనాడు ముఖ్యమంత్రిగా ఆయన కనపర్చిన పనితీరు ప్రతి ఒక్కరినీ ఆకట్టుకుంది. కరోనా కష్ట సమయంలోనూ పళనిస్వామి తమిళనాడు ప్రజలకు అండగా నిలిచారు. కేసులు తీవ్రత ఎక్కువవుతున్న సమయంలో కఠిన నిర్ణయాలు తీసుకుని కరోనాను కొంత మేరకు నివారించగలిగారు. ఇక నాలుగేళ్లలో తమిళనాడులో అభివృద్ధి కూడా జరిగింది. అదే సమయంలో సంక్షేమాన్ని కూడా పళనిస్వామి విస్మరించలేదు.జయలలిత ప్రవేశ పెట్టిన ప్రతి పథకాన్ని పళనిస్వామి అమలుపర్చారు. పెద్దగా అవినీతి ఆరోపణలను కూడా పళనిస్వామి ఎదుర్కొనక పోవడం ఈ సందర్భంగా గమనార్హం.

## పడిపోతున్న భూగర్భజలాలు.. తాగునీటికి కట కట

ఖమ్మం ఏప్రిల్ 21, (న్యూస్ పల్స్) భూగర్భ జలాలు అడుగంటి పోవడంతో చేతి పంపులు ద్వారా అర్థగంటకో బిందెడు నీరు రెక్కలు పడిపోయేవరకు కొట్టినా రంగుమారిన నీరు వస్తోంది. రక్షిత మంచినీటి సరఫరా పథకాలు తరచూ మరమ్మతులకు గురవడం, ముందు జాగ్రత్తలు చేపట్టకపోవడంతో గ్రామాలలో వాటర్ ట్యాంక్‌లు అలంకారప్రాయంగా మారాయి.గిరిజన గ్రామాలలో త్రాగునీటి సమస్య జటిలం కావడంతో ప్రజలు గుక్కెడు మంచినీటి కోసం వాగుల, వంకలను ఆశ్రయించి చెలిమ నీటిని వినియోగిస్తున్నారు. అనేక గ్రామాలలో మంచినీటి సమస్య ప్రజలను వేధిస్తోంది. విద్యుత్ సమస్య కూడా దీనికి తోడైంది. వాజేడు మండలాలలో గోదావరి ఒడ్డు మీద ఉన్న పూసూరు గ్రామంలో సుమారు 300కుటుంబాలకు పైగా ఉండగా గోదావరి ఒడ్డు దిగి కిలోమీటరుపైగా కాలి నడకన వెళ్లి ఇసుకలో చెలిమలు తీసుకుని మంచినీటిని తెచ్చుకుంటున్నారు. కడేకల్ గ్రామంలో ఒకే బావిలో నీరు ఉండడంతో గ్రామస్థులందరూ ఈ బావి నండే నీరు తెచ్చుకుంటున్నారు. దీంతో బావిలో నీరు అడుగంటి రంగు మారిన నీటిని వినియోగించుకుంటు అస్వస్థతకు గురవుతున్నారు. మొలకనపల్లి, కొండాపురం, సూరవీడు, ఎదిర, కర్రవోలు గుంపు, నూగరు ఇంకా అనేక గ్రామాలలో బోరు బావులు పనిచేయకపోవడంతో ఆయ గ్రామాల ప్రజలు వాగులు, వంకలు, చెరువులకు పరుగులు తీస్తున్నారు. సూరవీడు పంచాయతీలోని స్వయంగుంపు, కొండాపురం కాలనీవాసులు మాత్రం వాగులో చెలమలు తీసుకుని నీటి కష్టాన్ని ఎదుర్కొంటున్నారు. గిరిజన గ్రామాలలో నీటి ఎద్దడిని పరిష్కరించేందుకు సరైన ప్రణాళికతో అధికార యంత్రాంగం ముందుచూపు లేకపోవడంతో నీటిసమస్యతో గిరిజనులు సతమతమవుతున్నారు. ట్యాంకర్ల ద్వారా సరఫరా చేసే మంచినీరు పూర్తి స్థాయిలో లేకపోవడంతో విమర్శలు వస్తున్నాయి. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్, ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి నీటి సమస్యలుఉన్నగ్రామాలకుట్యాంకర్ల ద్వారా మంచినీటిని సరఫరా చేసి ఆదుకోవాలని గిరిజనలు పత్రిక ముఖంగా విజ్ఞప్తి చేస్తున్నారు

## నిమ్మగడ్డపై రివెంజ్ స్టార్ట్ అయినట్లేనా



విజయవాడ, ఏప్రిల్ 21, (న్యూస్ పల్స్) రాష్ట్ర మాజీ ఎన్నికల కమిషనర్ నిమ్మగడ్డ రమేష్ కుమార్ ను భవిష్యత్ లో అనేక కేసులు ఎదురు చూస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం నిమ్మగడ్డను ఉపేక్షించే అవకాశాలు లేవని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. నిమ్మగడ్డ రమేష్ కుమార్ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ గా పదవీ విరమణ చేశారు. ఆయన ప్రస్తుతం హైదరాబాద్ కే పరిమితమయ్యారు. అయితే గత ఒకటిన్నర సంవత్సరాల నుంచి ఆయన రాష్ట్ర ప్రభుత్వం పట్ల వ్యవహరించిన తీరును ఇప్పటికీ జగన్ సర్కార్ మర్చిపోలేకపోతుందట.అందుకే ఆయనపై కేసులు తవ్వి తీయాలన్న యోచనలో జగన్ సర్కార్ ఉంది. నిమ్మగడ్డ రమేష్ కుమార్ హోంశాఖకు గతంలో రాసిన లేఖ పై సీఐడీ విచారణ అప్పట్లో జరిగింది. ఆ లేఖ టీడీపీ కార్యాలయంలో తయారయిందని అప్పట్లో ఆరోపణలు విన్పించాయి. వైసీపీ రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి ఈ ఆరోపణలు చేశారు. తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో తయారైన ఆ లేఖను కేంద్ర హోంశాఖకు నిమ్మగడ్డ రమేష్ కుమార్ పంపారని ప్రభుత్వం అనుమానిస్తుంది.ఆ లేఖలో కూడా జగన్ ను ఫ్యాక్షనిస్టుగా నిమ్మగడ్డ రమేష్ కుమార్ పేర్కొనడాన్ని జగన్ ఇప్పటికీ జీర్ణించుకోలేక పోతున్నారట. దీంతో ఆ కేసును తవ్వితీసేందుకు యత్నాలు ప్రారంభమయినట్లు తెలిసింది. ఈ కేసులో నిమ్మగడ్డ రమేష్ కుమార్ ఖచ్చితంగా ఇబ్బంది పడతారని వైసీపీ వర్గాలు చెబుతున్నాయి. ముఖ్యమంత్రిపై తప్పుడు ఆరోపణలు చేయడమే కాకుండా, రాష్ట్ర ఎన్నికల కమిషనర్ గా ఉండి టీడీపీ, బీజేపీ నేతలతో సంబంధాలు కొనసాగించడంపైన కూడా సీఐడీ ఆరా తీయనుంది. దీనికి సంబంధించిన ఆధారాలను సేకరించింది.ఇక నిమ్మగడ్డ రమేష్ కుమార్ పై హక్కుల ఉల్లంఘన తీర్మానం ఎటూ ఉండనే ఉంది. ప్రివిలేజ్ కమిటీ ఇప్పటికే నిమ్మగడ్డ రమేష్ కుమార్ కు నోటీసులు జారీ చేసింది. ఈ కేసును మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సీరియస్ గా తీసుకున్నారు. తనను హౌస్ అరెస్ట్ చేయడాన్ని ఇప్పటికీ ఆయన సహించలేకపోతున్నారు. దీంతో తిరుపతి ఉప ఎన్నికల తర్వాత నిమ్మగడ్డ రమేష్ కుమార్ ను వరస కేసులు చుట్టుముట్టే అవకాశముందని తెలుస్తోంది. ఇన్నాళ్లూ ప్రభుత్వ నిధులతో న్యాయవాదులను నియమించుకున్న నిమ్మగడ్డఇక సొంత ఖర్చులు భరించాల్సిందేనని ఒక వైసీపీ నేత వ్యాఖ్యానించారు.

## ఆరుబయటనే మొక్కులు తీర్చుకున్న భక్తులు

విజయనగరంశ్రీరామనవమి వేడుకలపై కరోనా సెకెండ్ వేవ్ ప్రభావం చూపించింది. జిల్లాలో ప్రముఖ పుణ్య క్షేత్రమైన రామతీర్థంలో భక్తులకు దూరంగా శ్రీరామ నవమి వేడుకలు జరిగాయి. ఆలయ ఆరు బయట ప్రదేశంలో జరగవలసిన కళ్యాణం ఆలయంలోనే జరిపించటానికి అర్చకులు సన్నాహాలు చేసారు. దర్శనానికి వస్తున్న భక్తులను ఆలయం లోపలికి దేవాదాయశాఖ అధికారులు అనుమతించక పోవడంతో ఆలయ ఆరు బయటనే కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించుకొని భక్తులు వెనుతిరిగారు.

# కలవరపెడుతున్న కరోనా

హైదరాబాద్, ఏప్రిల్ 21, (న్యూస్ పల్స్) రోజుకు ఐదు వేలు కేసులకు పైగానే. కరోనా తెలంగాణను భయపెడుతుంది. మహారాష్ట్ర ప్రభావంతో తెలంగాణలో కేసుల సంఖ్య ఎక్కువగా ఉందని చెబుతున్నారు. సెకండ్ వేవ్ కరోనా తెలంగాణలో చుక్కలు చూపుతుంది. అయితే తొలిసారి కరోనా వైరస్ వచ్చినప్పుడు లాక్ డౌన్ ఉంది. దీంతో కరోనా కట్టడి చాలా వరకూ సాధ్యమయింది. కానీ సెకండ్ వేవ్ ను గట్టెక్కడం ఎలా అన్న దానిపై ప్రభుత్వం మల్లగుల్లాలు పడుతుంది. ప్రధానంగా వైద్య ఆరోగ్య శాఖ మంత్రి ఈటల రాజేందర్ నిత్యం అధికారులతో సమీక్ష చేస్తున్నారు.కరోనా సెకండ్ వేవ్ ఉధృతి తీవ్రంగా ఉందని ఈటల రాజేందర్ చెబుతున్నారు. ఆక్సిజన్ కొరత కూడా తీవ్రంగా ఉంది. బెడ్స్ దొరకడం లేదు. ప్రయివేటు ఆసుపత్రులు కరోనాను సొమ్ము చేసుకుంటున్నాయి. లక్షల్లో ముక్కుపిండి వసూలు చేస్తున్నారు. సెకండ్ వేవ్ వారు వీరు అని తేడా లేకుండా అందరికీ అంటుకుంటుంది. మధ్య తరగతి ప్రజలు ప్రయివేటు ఆసుపత్రుల్లో చికిత్స చేయించుకోలేక, ప్రభుత్వ ఆసుపత్రుల్లో బెడ్స్ దొరకక ఇబ్బంది పడుతున్నారు. కానీ ఈటల రాజేందర్ మాత్రం అంతా బాగానే ఉందంటున్నారు.ఇంత వేగంగా కరోనా వైరస్ వ్యాప్తి చెందుతున్నా ప్రభుత్వం మాత్రం ఎటువంటి చర్యలు చేపట్టడం లేదు. ప్రజలపైనే భారాన్ని మోపింది. లాక్ డౌన్, కర్ఫ్యూ లాంటి వి పెట్టబోమని ఈటల రాజేందర్ చెబుతున్నారు. ప్రజలు అవసరమైతే తప్ప బయటకు రావద్దని సూచిస్తున్నారు. లాక్ డౌన్ పెట్టకుండా ఉపాధిపనులకోసం బయటకు రావద్దంటే ఎలా అన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ఉపాధి కోసం



బయటకు వస్తున్న ప్రజలే ఎక్కువగా కరోనా బారిన పడుతున్నారు.ఇక హైదరాబాద్ లో కరోనా తీవ్రత ఎక్కువగా ఉండటంతో వలస కార్మికులు కూడా సిటీని వదిలి సొంతూళ్లకు వెళ్లిపోతున్నారు. కొన్ని వ్యాపార వర్గాలు స్వచ్ఛందంగా దుకాణాలు మూసివేస్తున్నాయి. క్షేత్ర స్థాయిలో కరోనా తీవ్రత ఎక్కువగా ఉన్నప్పటికీ లాక్ డౌన్ సమస్య లేదని ఈటల రాజేందర్ చెప్పడం పై సోషల్ మీడియాలో విమర్శలు విన్పిస్తున్నాయి. ప్రజల ప్రాణాలను ప్రభుత్వ ఆదాయం కోసం పణంగా పెడుతున్నారన్న కామెంట్స్ వినపడుతున్నాయి. స్వీయ నియంత్రణ తప్ప వేరే మార్గం లేదని ప్రభుత్వం తప్పించుకుంటోంది. ఇప్పటికైనా నైట్ కర్ఫ్యూ అయినా విధించి ప్రభుత్వం కరోనాను కొంతవరకూ కంట్రోల్ చేయాలని కోరుతున్నారు. హైకోర్టు చీవాట్లు పెట్టినా కూడా ప్రభుత్వంలో మాత్రం చలనం రాలేదు.

## అనంతలో మండుతున్న సూరీడు



అనంతపురం, ఏప్రిల్ 21, (న్యూస్ పల్స్) అనంతపురం జిల్లాలో ప్రచండ భానుడు ఉగ్రరూపం దాల్చాడు. నిప్పులు కురిపిస్తున్నాడు. ఎండవేడి, ఉక్కపోతతో జనం విలవిల్లాడుతున్నారు. 15 రోజులుగా జిల్లాలోని పలు ప్రాంతాల్లో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదువుతున్నాయి. పగలు ఉక్కపోత, వడగాల్పులతో జనం తల్లడిల్లుతున్నారు. అర్ధరాత్రి దాటితే గానీ ఉక్కపోత తగ్గడం లేదు. ముఖ్యంగా కణేకల్లు, ఉరవకొండ, రాయదుర్గం ప్రాంతాల్లో ఎడారీకరణతో ఇసుక మేటలు వేయడంతో ఎండతీవ్రత అధికంగా ఉంటోంది.ఈ నెలలో గరిష్టంగా 44 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదవుతోంది. కనిష్టంగా 26 డిగ్రీలు నమోదవుతోంది. ఎండలకు పది రోజుల్లో 10 మందికి పైగా వడదెబ్బ బారిన పడి మృత్యువాత పడ్డారు. సోమవారం సైతం ఉష్ణోగ్రత 43 డిగ్రీలకు చేరింది. జిల్లాలోని శింగనమల, పామిడి, తాడిమర్రి, ఉరవకొండ, గుంతకల్లు, ధర్మవరం, రాయదుర్గం, అనంతపురం, గుత్తి, బుక్కరాయసముద్రం, గార్లదినె?న, నార్పల, పుట్లూరు, యల్లనూరు, పుట్టపర్తి, విడపనకల్లు, కంబదూరు, తాడిమర్రి, పెనుకొండలో కనిష్టంగా 40 నుంచి 44 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదువుతోంది. గత ఏడాది ఇదే సమయంలో ఉష్ణోగ్రతలు ఇంతగా లేవు. ఒక్క నిమిషం విద్యుత్ కోత పడినా భరించలేని పరిస్థితి తలెత్తింది. గ్రామీణ ప్రాంతాల్లో అప్రకటిత కోతలు మొదలయ్యాయి.వృద్ధులు, చంటిపిల్లలు, బాలింతలు, వ్యాధిగ్రస్తులు ఉక్కపోతకు తట్టుకోలేక పోతున్నారు.అత్యధిక ఉష్ణోగ్రతల వల్ల జ్వరాల బారిన పడుతున్నారు.

## టీడీపీలో కలవరపెడుతున్న ఆడియోటేప్స్

శ్రీకాకుళం, ఏప్రిల్ 21, (న్యూస్ పల్స్) ఏదైనా రాజకీయాల్లో సాధ్యం. శత్రువులు మిత్రులవుతారు. మిత్రులు శత్రువులుగా మారడానికి క్షణం సమయం కూడా పట్టదు. అచ్చెన్నాయుడు విషయంలో ఇప్పుడు అదే జరుగతుంది. తిరుపతి ఉప ఎన్నిక సందర్భంగా లీకయిన వీడియో అచ్చెన్నాయుడుకు ఇబ్బందికరంగా మారింది. ఆ వీడియోలో నేరుగా లోకేష్ ను టార్గెట్ చేస్తూ మాట్లాడటంతో దానిపై వివరణ ఇచ్చేందుకు కూడా లోకేష్ అంగీకరించలేదని సమాచారం.ఎప్పటికైనా అచ్చెన్నాయుడు తనకు ఇబ్బందికరంగా మారతారని లోకేష్ భావిస్తున్నారు. అసలు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎంపిక చేసే సమయంలోనే అచ్చెన్నాయుడు పేరును లోకేష్ వ్యతిరేకించారని వార్తలు వచ్చాయి. బీద రవిచంద్రయాదవ్ కు ఇవ్వాలని లోకేష్ చంద్రబాబు పై బాగానే వత్తిడి తెచ్చారు. కానీ ఉత్తరాంధ్రలో బలపడాలన్నా, బలమైన వాయిస్ కావాలన్నా అచ్చెన్నాయుడు కరెక్ట్ అని చంద్రబాబు నచ్చ చెప్పిన తర్వాత లోకేష్ అచ్చెన్నాయుడు విషయంలో అయిష్టంగానే అంగీకరించినట్లు చెబుతున్నారు.ఇప్పటి వరకూ బాగానే ఉన్న తిరుపతి ఉప ఎన్నిక సమయంలో అచ్చెన్నాయుడు వీడియో టేపుల వ్యవహారంతో లోకేష్ రగలిపోతున్నారని చెబుతున్నారు. కిందిస్థాయి క్యాడర్ కు తప్పుడు సంకేతాలు వెళతాయని లోకేష్ అభిప్రాయపడుతున్నారు. అచ్చెన్నాయుడు కనీసం ఆ వీడియో టేపుల పై విచారణను కూడా కోరకపోవడంతో నిజమైన వీడియోనని లోకేష్ సయితం నమ్ముతున్నారు.అచ్చెన్నాయుడు విషయంలో తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యదర్శి లోకేష్ తన తండ్రి చంద్రబాబుపై వత్తిడి తెస్తున్నట్లు తెలిసింది. ఆయనను పదవి నుంచి తప్పించి వేరే వారికి ఇవ్వాలని సూచించినట్లు తెలిసింది. ఆయన స్థానంలో రామ్మోహన్ నాయుడుకు ఇచ్చినా తనకు అభ్యంతరం లేదని, అచ్చెన్నాయుడు మాత్రం రాష్ట్ర అధ్యక్షుడిగా ఉండటానికి వీల్లేదని లోకేష్ చంద్రబాబుకు అల్టిమేటం ఇచ్చినట్లు సమాచారం. దీనిపై చంద్రబాబు సయితం వత్తిడికి గురవుతున్నారు. అచ్చెన్నాయుడునే స్వచ్ఛందంగా పదవికి రాజీనామా చేసే యత్నాలు చేస్తున్నారని సమాచారం. మరి ఏం జరుగుతుందో చూడాలి.

## రఘురాముడిపై వైసీపీ సీరియస్

విజయవాడ, ఏప్రిల్ 21, (న్యూస్ పల్స్) వైసీపీ రెబల్ పార్లమెంటు సభ్యుడు రఘురామ కృష్ణంరాజు అతి చేస్తున్నారు. తనపై ఎలాంటి చర్యలు తీసుకోక పోవడంతో ఆయన తెగించినట్లే కనపడుతుంది. జగన్ బెయిల్ పిటీషన్ ను రద్దు చేయాలని ఆయన హైకోర్టులో పిటీషన్ వేయడం పై వైసీపీ సీరియస్ గా ఉంది. రఘురామ కృష్ణంరాజును ఉపేక్షించే కొద్దీ ఇంకా చెలరేగిపోతారని భావిస్తుంది. మరోసారి స్పీకర్ ను కలసి ఆయనపై అనర్హత వేటు వేయాలని కోరనున్నట్లు సమాచారం.అయితే బీజేపీ ఆలోచనగా కూడా వేరే గా ఉంది. రఘురామ కృష్ణంరాజు బీజేపీకి చేరువయ్యారు. ఆర్ఎస్ఎస్ నేతలను కూడా కలుస్తున్నారు. ఒక రకంగా బీజేపీ లో ఆయన అనధికారికంగా ఉన్నట్లే. తిరుపతి ఉప ఎన్నికలో ఓటమి పాలయినా నర్సాపురం పార్లమెంటు ఎన్నికలకు ఉప ఎన్నికను తీసుకురావాలన్నది పార్టీ రాష్ట్ర నేతల ఆలోచనగా ఉంది. తిరుపతి లో ఓటమి పాలయినా బలాన్ని నర్సాపురంలో చూపించుకోవాలని వారు భావిస్తున్నారు.నర్సాపురం పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో బీజేపీ, జనసేన బలంగా ఉన్నాయి. గత ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేసినప్పటికీ జనసేన అభ్యర్థి నాగబాబుకు రెండు లక్షల ఓట్లు పైగానే వచ్చాయి. పశ్చిమ గోదావరి జిల్లాలో వైసీపీ బలహీనమయిందని బీజేపీ నేతలు భావిస్తున్నారు. తిరుపతి లో విజయం వైసీపీకి దక్కినా వారికి ఆ ఆనందం ఎక్కువ రోజులు ఉండనివ్వకుండా ఉండేందుకు రఘురామ కృష్ణంరాజు ప్రాతినిధ్యం వహించే నర్సాపురం నియోజకవర్గానికి ఉప ఎన్నిక వస్తేనే మంచిదని భావిస్తున్నారు.రఘురామ కృష్ణంరాజు పై వైసీపీ కూడా సీ?రియస్ గా ఉంది. ఆయన మాటల క్లిప్పింగ్ లను ఇప్పటికే తీసి పెట్టుకున్న వైసీపీ తిరుపతి ఉప ఎన్నిక తర్వాత మరోసారి స్పీకర్ కు ఫిర్యాదు చేయాలని భావిస్తుంది. పార్టీ సభ్యుడిగా ఉంటూ పార్టీ అధినేతకు వ్యతిరేకంగా పిటీషన్ వేయడాన్ని జీర్ణించుకోలేకపోతుంది. ఇటు బీజేపీ ఆలోచన కూడా ఇలాగే ఉండటంతో రఘురామ కృష్ణంరాజు విషయంలో త్వరలోనే ఒక నిర్ణయం వెలువడే అవకాశముందంటున్నారు.

# టీడీపీ గూటికి రామసుబ్బారెడ్డి

కడప, ఏప్రిల్ 21, (న్యూస్ పల్స్) జమ్మలమడుగు రామసుబ్బారెడ్డి తిరిగి తెలుగుదేశం పార్టీలోకి రానున్నారా? ఆయన వైసీపీ అధిష్టా నంపై అసంతృప్తిగా ఉన్నారా? అంటే అవుననే అంటున్నారు. జమ్మల మడుగులో రామసుబ్బారెడ్డికి ఒక ప్రత్యేకత ఉంది. రెండు కుటుం బాలే జమ్మలమడుగును మొన్నటి వరకూ శాసిస్తూ వచ్చాయి. వరస ఓటములతో రామసుబ్బారెడ్డి ఆర్థికంగా చితికిపోయి ఉన్నారు. గత తెలుగుదేశంపార్టీ ప్రభుత్వ హయాంలో కొంత కూడబెట్టుకున్నప్పటికీ మొన్నటి ఎన్నికల్లో పూర్తిగా తుడిచిపెట్టుకుపోయాయి.అందువల్లనే రామసుబ్బారెడ్డి వైసీపీలో చేరారంటున్నారు. తన చిరకాల ప్రత్యర్థి ఆదినారాయణ రెడ్డి బీజేపీలో చేరినా తాను వైసీపీలో చేరడానికి ముఖ్య కారణం ఈ నాలుగేళ్లు ఆర్థికంగా, క్యాడర్ పరంగా ఇబ్బంది పడకుండా ఉండటం కోసమే. అయితే తాను ఉద్దేశ్యంతో వైసీపీలో చేరారో?అదినెరవేరడంలేదు. జమ్మలమడుగు ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి తనను కలుపుకుని పోవడం లేదు. ఇటీవల జరిగిన ఎన్నికల్లోనూ తన వర్గానికి పదవులు లభించలేదు.దీంతోపాటుతానుఆర్థికంగాబలపడకుండాఉండేందుకుసుధీర్ రెడ్డి అడ్డుకుం టున్నారు. ఏ కాంట్రాక్టులు కూడా తనకు దక్కనివ్వడం లేదు. అధికారులు కూడా తన మాటవినడంలేదు. ఈ విషయాన్ని రామసుబ్బారెడ్డి నేరుగా జగన్ దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదు. వైసీపీలో పదవులు లభిస్తాయన్న ఆశ కూడా రామసుబ్బారెడ్డికి పోయింది. దీంతో ఆయన ఇటీవల తన ముఖ్య అనుచరులతో సమావేశమయినట్లు తెలిసింది.ఇటీవల జగన్ తోరామసుబ్బారెడ్డి సమావేశమయ్యారు.వచ్చేఎన్నికల లోనూ సుధీర్ రెడ్డికే టిక్కెట్ అని చెప్పారు. కావాలంటే ఎమ్మెల్సీ పదవి ఇస్తాం సర్దుకుపొమ్మని అధిష్టానం చెప్పడంతో రామసుబ్బారెడ్డి నిరుత్సాహ పడినట్లు తెలిసింది. ఇదే విషయాన్ని అనుచరులతో చెప్పారు. టీడీపీలోనూ



ఎమ్మెల్సీ పదవి ఇచ్చిన విషయాన్ని వారు గుర్తు చేశారు. వైసీపీలో ఉన్నా భవిష్యత్ లేదని అనుచరులు కూడా రామసుబ్బారెడ్డిపై వత్తిడి తెచ్చినట్లు చెబుతున్నారు. ఆదినారాయణ రెడ్డి ఎన్నికలకు ముందు టీడీపీలోకి వచ్చే అవకాశాలు ఉండటంతో ఆయనకంటే ముందుగానే టీడీపీలో చేరాలని కొందరు గట్టిగా కోరుతుండటంతో రామసుబ్బారెడ్డి ఆలోచనలో పడినట్లు చెబుతున్నారు. అతి త్వరలోనే ఆయన చంద్రబాబును కలిసే అవకాశముందని కూడా జమ్మలమడుగులో చర్చ జరుగుతుంది.

# అనంత జిల్లాలో వైసీపీ పోరు



అనంతపురం, ఏప్రిల్ 21, (న్యూస్ పల్స్) అనంతపురం జిల్లా వైసీపీలో కొత్త పోరు ప్రారంభమైంది. ఎన్నికల ఫలితాలు ఇంకా రాకుండానే.. జడ్పీ చైర్‌పర్సన్ పీఠం చిచ్చురాజేస్తోంది. కుర్చీని చేజిక్కించుకునేందుకు బలమైన సామాజికవర్గాలు నువ్వా.. నేనా.. అంటూ పోటీ పడుతున్నాయి. జడ్పీ చైర్‌పర్సన్ పీఠం బీసీ మహిళకు రిజర్వ్ అయింది. దీంతో ఆయా సామాజికవర్గాల ప్రజాప్రతినిధులు, కులసంఘాల నేతలు తమ వారిని పీఠమెక్కించేందుకు పావులు కదుపుతున్నారు. ఎవరికి వారు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఇది అటు తిరిగి ఇటు తిరిగి.. మంత్రి శంకర్‌నారాయణకు, ఇద్దరు ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలకు చుట్టుకుంది.పీఠం ఆశిస్తున్నవారిలో ఎవరికివారు వీరిని ఆకర్షించే పనిలో పడ్డారు. తమ వాదనలను బలంగా వినిపిస్తూ జడ్పీ పీఠాన్ని కైవసం చేసుకునేందుకు ముమ్మరం చేశారు. అయితే.. అదే సమయంలో మరికొందరు మాత్రం..వైసీపీ అధిష్టానంపైనే ఆశలు పెట్టుకున్నారు. ఎందుకంటే.. స్థానిక, కార్పొరేషన్ పదవుల విషయంలో ఎంపీలు, ఎమ్మెల్యేలు ఎంత దెబ్బలాడుకున్నా అధిష్టానంనిర్ణయమే ఫైనల్ అయింది. జిల్లాలో అనంతపురం కార్పొరేషన్ మేయర్, మున్సిపల్ చైర్మెన్ పదవులు ఫలానా వారికే దక్కనున్నాయని బలంగా ప్రచారం సాగినా.. పంపకాల వద్దకొచ్చేసరికి అధిష్టానం నిర్ణయమే ఫైనల్ అయిపోయింది.ఈ నెల 8న పరిషత్‌కు పోలింగ్ నిర్వహించారు. కోర్టు ఆదేశాల మేరకు 10న జరగాల్సిన ఓట్ల లెక్కింపు ప్రక్రియను వాయిదా వేశారు. కోర్టు ఆదేశాలు ఎప్పుడు వస్తే.. అప్పుడు ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభం కానుంది. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పీఠం కోసం ఆది నుంచి వైసీపీలో ముగ్గురు ఆశావాహుల పేర్లు వినిపిస్తున్నాయి. ఆత్మకూరు నుంచి పోటీచేసిన బోయ గిరిజమ్మ, కూడేరు నుంచి పోటీలో ఉన్న అశ్వినీ హరీష్, తనకల్లు నుంచి జక్కల జ్యోతి ఉన్నారు.తాజాగా గుత్తి మండలం నుంచి పోటీ చేసిన నార్వేని రాధిక జడ్పీ చైర్‌పర్సన్ పీఠాన్ని ఆశిస్తున్నారు. జిల్లాలో ఈ నలుగురి పేర్లే ప్రముఖంగా వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఎవరికివారు పీఠాన్ని దక్కించుకునేందుకు తీవ్రస్థాయిలో వైసీపీలో ప్రయత్నాలు సాగిస్తున్నారు. ఎవరికివారు ఎంపీ, మంత్రి, ఎమ్మెల్యేలను కలిసి.. మద్దతు కోరుతున్నారు. దీంతో ఎవరినీ కాదనలేక వారంతా తర్జన భర్జన పడుతుండడం గమనార్హం.

# రావెల పక్క చూపులు

గుంటూరు, ఏప్రిల్ 21, (న్యూస్ పల్స్) రాజకీయాల్లో ఒక్కసారి రాంగ్ స్టెప్ వేస్తే ఇక అంతే. భవిష్యత్ వెతుక్కున్నా కనపడదు. మాజీ మంత్రి రావెల కిషోర్ బాబు పరిస్థితి అలాగే ఉంది. పార్టీలు వరసగా మారినా ఆయనకు రాజకీయ భవిష్యత్ కనుచూపు మేరలో కన్పించడం లేదు. ప్రత్తిపాడు నియోజకవర్గం నుంచి కాకుండా మరో నియోజకవర్గానికి రావెల కిషోర్ బాబు మారాలనుకున్నా పరిస్థితులు అందుకు అనుకూలంగా లేవంటున్నారు.కిశోర్ బాబు మాజీ ఐఆర్ఎస్ అధికారి. రాజకీయాల్లోకి వచ్చిరాగానే తెలుగుదేశం పార్టీలో చేరి ప్రత్తిపాడు ఎమ్మెల్యేగా గెలిచారు. వెనువెంటనే సామాజికవర్గం కోణంలో మంత్రి పదవిని దక్కించుకున్నారు. అంతా సాఫీగా సాగిపోతుందనుకున్న సమయంలో నియోజకవర్గంలోని ఒక సామాజికవర్గం తనను డామినేట్ చేయడం ఆయన సహించలేకపోయారు. వారికి ఎదురు తిరిగారు. ఫలితంగా మంత్రిపదవి ఊడిపోయింది.టీడీపీ నుంచి వైసీపీలోకి వెళ్లాలనుకున్నా అక్కడ అవకాశాలు లేకపోవడంతో జనసేనలో చేరారు. ఆ పార్టీ నుంచి పోటీ చేసి దారుణ ఓటమిని చవిచూశారు. 2019 ఎన్నికల అనంతరం జనసేనను వీడి భారతీయ జనతా పార్టీలో చేరారు. రావెల కిషోర్ బాబు చేరిన తర్వాత జనసేన పార్టీ బీజేపీతో పొత్తు పెట్టుకుంది. దీంతో జనసేన, బీజేపీ కూటమి నుంచి ప్రత్తిపాడు నియోజకవర్గం నుంచి పోటీ చేసినా ఫలితం ఉండదు. అక్కడ టీడీపీ, వైసీపీ బలంగా ఉండటంతో మరోసారి ఎమ్మెల్యే అయ్యే ఛాన్స్ ఉండదని రావెల కిషోర్ బాబు భావిస్తున్నారు.మరో రిజర్వ్ నియజకవర్గం కోసం ఆయన వెతుకులాట ప్రారంభించినట్లు తెలిసింది. తిరిగి టీడీపీలో చేరడమా? లేక వైసీపీలో చేరి మరో రిజర్వ్ నియోజకవర్గం నుంచి పోటీ చేయడమా? అన్న ఆలోచనలో రావెల కిషోర్ బాబు ఉన్నట్లు తెలుస్తోంది. ఇటీవల సన్నిహితులతో ఎక్కువ మంది అభిప్రాయపడినట్లు తెలిసింది. మొత్తం మీద మాజీ మంత్రి రావెల కిషోర్ బాబు త్వరలోనే కీలక నిర్ణయం తీసుకోనున్నారు.



## ఏసీ కోచ్ లలో క్వారంటైన్

విశాఖపట్టణం, ఏప్రిల్ 21, (న్యూస్ పల్స్) కరోనాపై పోరాటంలో తమవంతు సహాయ సహకారాలను అందించేందుకు వాల్తేర్ డివిజన్ కృషి చేస్తుంది. దీనిలో భాగంగా స్లీపర్‌క్లాస్, ఏసీ కోచ్‌లను క్వారంటైన్, ఐసోలేషన్ వార్డులుగా మార్పులు చేస్తోంది. ప్రాథమిక దశలో 5వేల కోచ్‌లను ఈ విధంగా మార్పులు చేసేందుకు ఇండియన్ రైల్వే శ్రీకారం చుట్టింది. దీనిలో భాగంగా వారంరోజుల్లో వాల్తేర్ డివిజన్ 60 కోచ్‌లలో 500 ఐసోలేషన్ పడకలను తయారుచేసింది. వాల్తేర్ డివిజన్. డివిజనల్ రైల్వే మేనేజర్ చేతన్‌కుమార్ శ్రీ వాస్తవ పర్యవేక్షణలో వాల్తేర్ డివిజన్ కోచింగ్ డిపో సిబ్బంది ఈ తరహా పడకలు తయారుచేయడంలో ముందున్నారు.అన్ని స్లీపర్‌క్లాస్ కోచ్‌లలో ఉండే మధ్య బెర్తులు (మిడిల్ బెర్తులను) తొలగించారు.ప్రతీ బేలో కేవలం ఒక బెడ్ చొప్పున కోచ్‌కు 9 వార్డులను రూపొందించారు. కోచ్‌లలో ఉండే నాలుగు టాయ్‌లెట్లలో ఒకదానిని బాత్‌రూమ్‌గా మార్చారు. కోచ్‌లలో ఉండే 6 వాష్‌బేసిన్ల వద్ద లిక్విడ్ సోప్ డిస్పెన్సర్స్ ఏర్పాటుచేశారు. ప్రతీ బే వద్ద నాలుగు బాటిల్ హోల్డర్స్ (సెలైన్ బాటిల్స్ కోసం) ఏర్పాటుచేశారు. ప్రతీ కూపే వద్ద పెడల్ ఆపరేటెడ్ డస్ట్‌బిన్లు ఏర్పాటుప్రతీ బాత్‌రూం బకెట్, మగ్ అందుబాటులో ఉంచారు. ప్రతీ కోచ్‌లోను మెడికల్ సిబ్బందికి, వైద్యులకు ప్రత్యేకంగా మూడు కర్టెన్లు ఏర్పాటు. అన్ని కోచ్‌లలో ఆక్సిజన్ సిలిండర్ స్టాండ్లు అమరిక.అన్ని కోచ్‌లలో దోమతెరల ఏర్పాటు అన్ని కోచ్‌లలో ఆధునాతన శానిటైజేషన్, డిజిన్‌ఫెక్షన్ పరికరాలతో కూడిన క్లీనింగ్‌కు సిబ్బంది. అందుబాటులో మాస్కులు, పీపీఈలు, శానిటైజర్లు వినియోగిస్తున్నారు.

## కమల నేతలపై జనసేన గుస్సా

తిరుపతి, ఏప్రిల్ 21, (న్యూస్ పల్స్) తిరుపతి ఉప ఎన్నికల ఫలితాల అనంతరం రాష్ట్రంలో రాజకీయ పరిణామాలు మారబోతున్నాయి. భారతీయ జనతా పార్టీ, జనసేన బంధంపై కూడా ఫలితం ప్రభావం ఉండనుంది. తిరుపతిలో పట్టుబట్టి మరీ బీజేపీ తన అభ్యర్థిగా రత్న ప్రభను బరిలోకి దించింది. జనసేన పోటీ చేయాలనుకున్నా పవన్ కల్యాణ్ ను ఒప్పించి మరీ సీటును తాము తీసుకున్నారు. రత్న ప్రభను అన్ని కోణాల్లో ఆలోచించి మరీ బీజేపీ అధినాయకత్వం ఎంపిక చేసింది.పవన్ కల్యాణ్ కూడా రత్న ప్రభకు మద్దతుగా ఒక విడత ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. రత్న ప్రభను గెలిపించాలని జనసేన అధినేత పిలుపునిచ్చారు. అయితే తిరుపతి ఉప ఎన్నిక పూర్తయిన తర్వాత అనేక సందేహాలు తలెత్తుతున్నాయి. పవన్ కల్యాణ్ తన ప్రసంగంలో కేవలం వైసీపీనే టార్గెట్ చేశారు. చంద్రబాబు ఊసే ఎత్తలేదు. గతంలో చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు కూడా పవన్ కల్యాణ్ వైసీపీనే టార్గెట్ చేసుకున్నారు.జనసేన ఓటు బ్యాంకు బీజేపీకి పడుతుందా? లేదా? అన్న సందేహాలు సర్వత్రా తలెత్తాయి. జనసేన, బీజేపీ పొత్తు తర్వాత తొలిసారి జరుగుతున్న అతి పెద్ద ఎన్నిక ఇది. మున్సిపల్ ఎన్నికలు పార్టీ గుర్తుమీద జరిగినా స్థానిక పరిస్థితులను బట్టి అక్కడ పొత్తులు కుదుర్చుకున్నారు. తిరుపతి పార్లమెంటు నియోజకవర్గం పరిధిలో బీజేపీ కంటే జనసేనకు బలం ఎక్కువగా ఉంది. కాపు సామాజికవర్గం ఓట్లతో పాటు పవన్ అభిమానులు ఇక్కడ ఎక్కువగా ఉన్నారు.బీజేపీ తమ అధినేత పట్ల వ్యవహరిస్తున్న తీరుపట్ల జనసేన క్యాడర్ మండిపడుతుంది. పవన్ ను ముఖ్యమంత్రి అభ్యర్థిగా ప్రకటించినా ఇది తిరుపతి ఉప ఎన్నిక కోసమేనని వారు బహిరంగం గానే వ్యాఖ్యానిస్తున్నారు. ప్రచారంలోనూ జనసేన క్యాడర్ పెద్దగా పాల్గొనకపోవడం ఇందుకు మరింత సందేహాలను ఇస్తుంది. జనసేన అధినేత మద్దతు తెలిపినా తాము బీజేపీకి ఓటు వేసే ప్రసక్తి లేదని కొందరు సోషల్ మీడియాలో కామెంట్స్ పెడుతున్నారు. దీంతో జనసేన ఓటు బ్యాంకు బీజేపీకి బదిలీ కావడం జరగని పని అని కొందరు అభిప్రాయపడుతున్నారు. ఎన్నికల ఫలితాల తర్వాత దీనిపై స్పష్టత రానుంది. ఈ తిరుపతి ఉప ఎన్నిక ఫలితం తర్వాత పవన్ కల్యాణ? కూడా ఒక నిర్ణయం తీసుకునే అవకాశముంది.

## వ్యాక్సిన్ కోసం క్యూలు కడుతున్న ప్రజలు

కొత్తపేట వ్యాక్సినేషన్ కోసం ప్రజలు పోటీపడు తున్నారు. కోవిడ్ సెకెండ్ వేవ్ ఉధృతం గా వ్యాప్తి చెందుతుండడంతో ప్రజలు వ్యాక్షిన్ కోసం ఎగబడుతున్నారు. నిన్న మొన్నటి దాకా వ్యాక్సిన్ వేయించుకోండి.. అపోహలు వద్దు అంటూ అధికారులు అవగాహన కల్పిస్తే తప్ప వ్యాక్సిన్ వేయించుకోవడానికి వచ్చే పరిస్థితి ఉండేది కాదు. కానీ గత వారం రోజులుగా పాజిటివ్ కేసులు విపరీతంగా పెరుగుతుండ డంతో జనం వ్యాక్సిన్ కోసం ప్రభుత్వ ఆసుపత్రిల వద్ద క్యూలు కడుతున్నా రు.తూర్పు గోదావరి జిల్లా కొత్తపేట ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి వద్ద అయితే అంతకు మించి అన్నట్టు ఉంది పరిస్థితి.కరోనా నిబంధనలు పక్కనపెట్టి వ్యాక్సిన్ కోసం గుంపులు గా ఎగబడుతున్నారు.అధికారులు దీనిపై దృష్టి సారించి ఒక క్రమ పద్ధతిలో ప్రజలు వ్యాక్సిన్ వేయించు కునేలా చర్యలు తీసుకోకపోతే ఆసుపత్రుల సాక్షిగా కరోనా విజృంభించే ముప్పు పొంచి ఉంది.

## గుత్తిలో రాములోరి కళ్యాణం

అనంతపురం అనంతపురం జిల్లా గుత్తిలోని కొదండ రామాలయంలో అత్యంత వైభవంగా సీతారాముల కళ్యాణం నిర్వహించారు. అనంతపురం జిల్లా గుత్తిలో కోటలో వెలసిన కొదండ రామాలయంలో సీతారాముల కళ్యాణం అంగరంగవైభవంగా నిర్వహించారు. కోవిడ్ నిబంధనలను పాటిస్తూ వందలాది మంది భక్తుల మధ్య సీతారాముల కళ్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. స్వామి వారికి మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి దంపతులు పట్టు వస్త్రాలను సమర్పించారు. సీతారాముల కళ్యాణాన్ని వీక్షించడానికి దేవాలయం వద్దకు వందలాది మంది భక్తులు బారులు తీరారు.. గత ఏడాది లాక్ డౌన్ కారణంగా వేలాది మంది భక్తుల మధ్య జరగాల్సిన సీతారాముల కళ్యాణం ఏకాంతంగా అర్చకులు మాత్రమే నిర్వహించాల్సి వచ్చింది. ఈ సారీ కరోనా వైరస్ సెకెండ్ వేవ్ వ్యాప్తి కారణంగా కోవిడ్ నిబంధనలు పాటిస్తూ స్వామి వారిని దర్శించుకునేలా భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు..ఈ నేపథ్యంలో సీతారాముల కళ్యాణాన్ని వీక్షించేందుకు భక్తులు దేవాలయం బయట నుండి శానిటైజర్ ,మాస్క్ ధరించి ,భౌతిక దూరాన్ని పాటిస్తూ కళ్యాణాన్ని వీక్షించారు.టెంకాయలు సైతం దేవాలయం బయటే కొట్టి సీతారాముల మీద తమకున్న అపారా భక్తిప్రపత్తులను చాటుకున్నారు.

# కరోనా ఉధృతిలో 10వ తరగతి, ఇంటర్ పరీక్షలు నిర్వహణ రద్దు చేయాలి

## ఎన్ ఎస్ యు ఐ బీసీ,ఎస్సీ, ఎస్టీ, వసతి గృహల రాష్ట్ర కన్వీనర్ వీరేష్ యాదవ్



ఎమ్మిగనూరు ఏప్రిల్ 21 ( విభారె ప్రతినిధి) వసతి గృహాలు మూసివేసి పదవ,ఇంటర్ తరగతులు నిర్వహిస్తే పేద విద్యార్థులు నష్టపోతారని, అందరికీ సెలవులు ప్రకటించాలని డిమాండ్ చేశారుఎన్ ఎస్ యు ఐ రాష్ట్ర కన్వీనర్ వీరేష్ యాదవ్ ఒక ప్రకటన లో మాట్లాడుతూ ప్రస్తుతం కరోనా తీవ్రత వల్ల ఆరోగ్య విపత్తు తలెత్తి ప్రజలందరూ తీవ్ర భయాందోళనలో ఉంటే 10వ తరగతి, ఇంటర్ పరీక్షలు నిర్వహణ రాష్ట్ర ప్రభుత్వ మూర్ఖకత్వమేనని,పరీక్షలు నిర్వహించడం వల్ల లక్షల మంది విద్యార్థులనే కాదు వారి కుటుంబాలను కరోనా ముప్పులోకి నెట్టేస్తుందని ,సి.బి.ఎస్.ఈ. కూడా కేంద్రం రద్దు చేసి ప్రమోట్ చేసిందని ,ఇప్పటికే మన రాష్ట్రంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు కరోనా బారిన పడి ఇబ్బందులు పడుతూ ప్రాణాలు పోతున్న పరిస్థితి రోజు పత్రికల్లో, మీడియా లో చూస్తూ ఉన్నామాన్ని, తక్షణమే 10వ తరగతి, ఇంటర్మీడియెట్ పరీక్షలు రద్దు చేసి విద్యార్థులను పైతరగతులకు ప్రమోట్ చేయాలని ఎన్ఎస్ యు ఐ ఆంధ్రప్ర దేశ్ రాష్ట్ర కమిటీ పిలుపు నిచ్చిందని ,కరోనా తీవ్రత వల్ల ఆరోగ్య విపత్తు తలెత్తి ప్రజలందరూ తీవ్ర భయాందోళనలో ఉన్నారు కావున రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు రక్షణగా ఉండాలని కోరారు. కరోణ నేపథ్యంలో తెలంగాణ రాష్ట్రంలో పరీక్షలు రద్దు చేయడం జరిగింద న్నా రు. రాష్ట్ర ముఖ్యమంత్రి విద్యాశాఖ మంత్రి చర్చించి పరీక్షలపై నిర్ణయం తీసుకోవాలని కోరారు.

# ఈదురు గాలులకు నేల రాలిన మామిడి కాయలు

## అకాల వర్షాలతో మామిడి రైతులకు తీవ్ర నష్టం.

పత్తికొండ ( విభారె విలేకరి) : పత్తికొండ నియోజకవర్గ పరిధిలో మంగళవారం రాత్రి వీచిన ఈదురు గాలులు రైతులకు కన్నీళ్ళు పెట్టిస్తోంది. పత్తికొండ నియోజకవర్గ పరిధిలోనిపత్తికొండ, మద్దికెర,తుగ్గలి,దేవనకొండ మండలాల్లో రైతులు మామిడి,బొప్పాయి, అక్కడక్కడ అరటి పంటలు సాగు చేస్తున్నారు.పంటలు అన్ని చేతికొచ్చే సమయంలో పెను గాలులకు పంటలు నేలరా లాయి.ఈదురు గాలులకు అరటి, బొప్పాయి చెట్లు నేలకొరిగా యి.అక్కడక్కడా కొద్దిపాటి వర్షం కురిసింది.హార్టికల్చర్ అధికారులు స్పందించి నష్టపరిహారం చెల్లించాలని రైతులు కోరుతున్నారు.వివరణ: ఈ విషయమై పత్తికొండ ఉద్యానవనశాఖ అధికారిణి అనూష ను వివరణ కోరగా రైతులు ఆయా గ్రామాల్లోని సచివాలయాలలో ఉన్న ఉద్యానవనశాఖ యంపీఈఓ ను కలిసి,పంటనష్టం వివరాలు నమోదు చేయించుకోవా లని,నివేదికలను జిల్లా ఉన్నతాధికారులకు తెలుపుతామన్నారు.

# రమణీయం కమణీయంగా శ్రీ సీతారాముల కళ్యాణం మహోత్సవం వేడుకలు

కౌతాళం( విభారె విలేకరి), ::రమణీయం కమణీయం గా శ్రీ సీతారాముల కళ్యాణం మహోత్సవం వేడుకలు అంగ రంగ వైభోవంగా జరిగింది. బుదవారం శ్రీరామనవమి సందర్భంగా మండల పరిధిలో రాజనగర్ క్యాంపు శ్రీ సీతారామ ఆంజనేయ ఆలయంలో రాముని కళ్యాణ మహోత్సవ వేడుకలు గ్రామ పెద్దలు నిర్వహించారు.ఆలయానికి విద్యుత్ దీపాలు మావిడకులు, పచ్చతోరణాలు పూలమాలలు వేసి ఘనంగా అలంకరించారు. వేదపండితులు సాక్షిగా సీతారాముల కళ్యాణం జరిగింది త్రిమూర్తులు కుమారులు, పృధ్విరాజు అతని భార్య ఆదిదంపతులుగ సీతారాముల కళ్యాణము జరిపించారు. వేదపండితులు కళ్యాణ మండపంలో శ్రీ సీతారాముల వేద మంత్రాలతో కల్యాణ మహోత్సవం జరిపించారు.అనంతరం వేదపండితులు మాట్లాడుతూ రామనామం ఎంతో ఉత్తమమైనది ప్రతి రోజు రామ నామం జరిపిస్తే కష్టాలు వెదలి సుఖసంతోషాలతో ఉంటారని తంద్రికి కొడుకు మీద ఉన్న ప్రేమ, కొడుక్కి తండ్రిమీద ఉన్న గౌరవమని, భర్తకు భార్య మీద ఉన్న బాధ్యత, భార్యకు భర్త మీద ఉన్న నమ్మకం మని, అన్నకు తమ్ముడు మీద ఉన్న విశ్వాసం, తమ్ముడికి అన్న మీద ఉన్న మమకారం మనిషిలోని బలం మరో మనిషిలోని స్వార్థం అండగా నిలిచిన మనుషులు అన్ని కలిపిన మనిషిని మనిషిగా బ్రతకడానికి అవసరమైన దే మన రామాయణం అని వివరించారు. గ్రామ ప్రజలు భక్తులు కళ్యాణ మహోత్సవం ఆనందంగా తిలకించి టెంకాయలు సమర్పించి మొక్కులు



తీర్చుకున్నారు. అనంతరం భక్తులకు నైవేద్యం, భోజన వసతులు కల్పించారు. గ్రామ ప్రజలు కోవిడ్ నిబంధనలు పాటించారు.

# ఘనంగా శ్రీరామ నవమి పూజ, అన్నప్రసాద వితరణ కార్యక్రమాలు.

నెల్లూరు ( విభారె విలేకరి) స్థానిక పొదలకూరు రోడ్డు,ప్రగతినగర్ ప్రాంతంలో ఉన్న శ్రీ శ్రీ శ్రీ వరసిద్ధి వినాయక అభయ హనుమాన్ ఆలయంలో ఘనంగా శ్రీరామనవమి పూజలు బుధవారం నిర్వాహకులు ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో సీత, శ్రీరామ ,లక్ష్మణ హనుమాన్ విగ్రహాలను అర్చక దేవతామూర్తులుగా నెలకొల్పి ,స్వాముల వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమం శ్రీ వరసిద్ధి వినాయక అభయ హనుమాన్ ఆలయ చైర్మన్ ఐనకోట మధుసూదన్ ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా స్వామివారి సేవా కార్యక్రమాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు కరోనా నియమ నిబంధనలు పాటిస్తూ పూజల్లో పాల్గొన్నారు. కరోనా వైరస్ మహమ్మారి నుండి తప్పించుకునేందుకు ప్రజలకు తగిన ఆరోగ్యాన్ని ప్రసాదించాలని కోరుకున్నారు.ఈ సందర్భంగా స్థానిక ప్రజలు, స్వామి వారి భక్తులు అనేక మంది పాల్గొని అభిషేకాలు, అష్టోత్తర, శతనామావళి అర్చనలు గావించారు. స్వామి వారి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న భక్తులకు నైవేద్యము పాటు బెల్లం పానకం చల్లని మజ్జిగ అందజేశారు. అనంతరం అన్నప్రసాద వితరణ దాతలు తులసి రామ్, మోహన్ రెడ్డి, హరి తదితరుల సౌజన్యంతో అన్నప్రసాద వితరణ కార్యక్రమం ఘనంగా, ఎటువంటి లోటుపాట్లు లేకుండా జరిగింది. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ ఐనకోట మధుసూదన్ మాట్లాడుతూ ఒక తండ్రికి కొడుకు మీద ఉన్న ప్రేమ, కొడుక్కి తండ్రి మీద ఉన్న గౌరవం, ఒక భర్తకు భార్య మీద ఉన్న బాధ్యత, ఒక భార్యకు భర్త మీద ఉన్న నమ్మకం, ఒక అన్నకు తమ్ముడు మీద ఉన్న విశ్వాసం, ఒక తమ్ముడు కు అన్న మీద ఉన్న మమకారం, ఒక మనిషిలోని బలం, మరో మనిషిలోని స్వార్థం, అండగా నిలిచిన మనుషులు,, ,, అన్ని కలిపి మనిషిని మనిషిగా బ్రతకడానికి అవసరమైన ఒక నిఘంటువు ఏర్పడుతుందన్నారు. ఆ నిఘంటువుని



రామాయణం అని చరిత్ర చెబుతోందన్నారు. తన తండ్రి హయాంలో నెలకొల్పిన దేవాలయం సన్నిధిలో తాను దైవ సేవ చేసుకునేందుకు అవకాశం రావడం గర్వించదగ్గ విషయమన్నారు. ఈ సందర్భంగా శ్రీరామనవమి పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించేందుకు చేయూతనిచ్చిన స్నేహితులకు, శ్రేయోభిలాషులకు, కమిటీ సభ్యులకు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ దైవ మహోత్సవ కార్యక్రమంలో తులసి రామ్, హరి, సాయి, రమణయ్య, ఆంజనేయ ప్రసాద్, ఏ వన్ ఫ్యాషన్ అధినేత కొండయ్య, పి మధుసూదన్ రావు తదితరులు పాల్గొన్నారు.

# నిరాడంబరంగా ఒంటిమిట్ట బ్రహ్మోత్సవాలు

## పట్టువస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే మేడా

కడప,ఏప్రిల్21( విభారె విలేకరి) ఒంటిమిట్ట కోదండరామస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు నిరాడంబరంగా వేదోక్తంగా ప్రారంభం అయ్యాయి. కరోనా వ్యాప్తి నేపథ్యంలో శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలు ఏప్రిల్ 29 వరకు ఆలయంలోనే ఏకాంతంగా జరుగనున్నాయి. నేడు శ్రీరామనవమిని పురస్కరించుకొని.. ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామివారి ఆలయంలో బుధవారం ఉదయం ధ్వజారోహణంతో శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఆలయ ప్రధాన కంకణబట్టర్ శ్రీరాజేష్ కుమార్ భట్టర్ ఆధ్వర్యంలో ధ్వజారోహణం కార్యక్రమం జరిగింది. అనంతరం శ్రీరామనవమి, పోతన జయంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో రమేష్ బాబు, ఎఇఒ మురళీధర్, సూపరింటెండెంట్లు వెంకటాచలపతి, వెంకటేశయ్య, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ధనంజయులు, ఇతర అధికారులు పాల్గొన్నారు. బ్రహ్మోత్సవాల మొదటిరోజైన ధ్వజారోహణం సందర్భంగా.. రాజంపేట ఎమ్మెల్యే, టిటిడి ధర్మకర్తల మండలి సభ్యులు మేడా మల్లికార్జునరెడ్డి దంపతులు కోదండరామస్వామి వారికి పట్టువస్త్రాలను సమర్పించారు. బుధవారం రాత్రి సీతాలక్ష్మణ సమేత శ్రీరాములవారు శేషవాహనంపై దర్శనమివ్వనున్నారు.

# కిమ్స్ కోవిడ్ ఆసుపత్రిని పరిశీలించిన కలెక్టర్

అమలాపురం ( విభారె విలేకరి) అమలాపురం కిమ్స్ కోవిడ్ ఆసుపత్రిని జిల్లా కలెక్టర్ మురళీధర్ రెడ్డి బుధవారం పరిశీలించారు. తరువాత అయన అమలాపురం సబ్ కలెక్టర్ కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో 9 ప్రవేటు కోవిడ్ హాస్పిటల్స్, 3 గవర్నమెంట్ హాస్పిటల్స్ రన్ చేస్తున్నాం. జిల్లా కోవిడ్ హాస్పిటల్స్ గా కాకినాడ,రాజమండ్రి, అమలాపురం మార్చామని అన్నారు. జిల్లాలో 470 మంది చికిత్స పొందుతు న్నారు. జిల్లాలో 2000 బెడ్స్ అందుబాటులో ఉన్నాయి వాటిని మరింత పెంచుతాం. ఆక్సిజన్ కు ఎటువంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. హాస్పిటల్స్ లో జాయిన్ అవ్వడానికి వచ్చేవారిలో సెంటెమ్స్ ఎక్కువగా ఉంటేనే జాయిన్ చేస్తున్నామని అన్నారు.హోమ్ ఐసోలేషన్ లో ఎక్కువ మంది ఉన్నారు. హోమ్ ఐసోలేషన్ లో ఉన్నవారికి కిట్స్ పంపిణీ చేస్తున్నాం. కోవిడ్ సెంటెమ్స్ ఉన్నవారికి ప్రతిఒక్కరికి టెస్టులు చేస్తున్నాం. రేపు జిల్లాలో వేక్సిన్ రెండవ డోస్ వాళ్లకు మాత్రమే వేయడం జరుగుతుందని కలెక్టర్ వెల్లడించారు.

## కోవీషీల్డ్ టీకాల ధరలను ప్రకటించిన సీరం సంస్థ

పుణె ఏప్రిల్ 21 కోవీషీల్డ్ ఉత్పత్తి చేస్తున్న సీరం సంస్థ ఇవాళ టీకాల ధరలను ప్రకటించింది. రాష్ట్ర ప్రభుత్వాలకు కోవీషీల్డ్ టీకాలను రూ.400కు ఒక డోసు చొప్పున ఇవ్వనున్నట్లు సీరం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా సీఈవో ఆధార్ పూనావాలా తెలిపారు. ఇక ప్రైవేటు హాస్పిటళ్లలకు ఒక డోసు కోవీషీల్డ్ టీకాను రూ.600కు ఇవ్వనున్నట్లు ఆయన చెప్పారు. సీరం సంస్థ తన ట్విట్టర్‌లో దీనికి సంబంధించిన ప్రకటన జారీ చేసింది.

# రంభ అభిమానిగా జగ్గూ భాయ్, ఎందుకంటే..?




తొంబై దశకంలో తెలుగు ప్రేక్షకులను అభినయంతో పాటు అందచందాలతో అలరించి వారి హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్న నాయకీమణుల్లో రంభ ఒకరు. స్టార్ హీరోలతో జోడీ కట్టిన ఈ అమ్మడు పెళ్లి చేసుకున్న తర్వాత సినిమాలకు దూరమైంది. ఎంతో మంది అభిమానులను సంపాదించుకున్న రంభకు నేనూ ఓ అభిమానినే అంటున్నారు జగ్గూ భాయ్ అలియాస్ జగపతిబాబు. ఏంటి నిజంగానే..! అనే సందేహం రావచ్చు. రియల్ లైఫ్‌లో కాదులెండి.. రీల్ లైఫ్‌లో. సినిమాల్లో జగపతిబాబు, రంభ జోడీగా నటించిన సంగతి తెలిసిందే. ఈ రీల్ జోడీ మరోసారి ప్రేక్షకులను మెస్మరైజ్ చేయనుంది. కానీ జోడీ కాదండోయ్.. అక్కడే ఉంది అసలు కిటుకు, వివరాల్లోకి వెళితే, అజయ్ భూపతి దర్శకత్వంలో రూపొందుతోన్న చిత్రం 'మహా సముద్రం'. శర్వానంద్, సిద్ధార్థ్, అదితిరావు హైదరి, అను ఇమ్మాన్యుయేల్ హీరో హీరోయిన్లుగా నటిస్తున్నారు.ఈ సినిమా షూటింగ్ రీసెంట్‌గా వైజాగ్‌లో జరిగింది. ప్రత్యేకం గా వేసిన సెట్‌లో జగపతిబాబుపై ఓ స్పెషల్ సాంగ్‌ను చిత్రీకరించారు. ఈ సాంగ్‌లో రంభ ఫొటోలు, ఫ్లెక్సీలు కనిపిస్తాయి. ఎందుకంటే.. మహా సముద్రంలో జగపతిబాబు, రంభ అభిమానిగా కనిపిస్తారు. ఈ సాంగ్‌లో శర్వానంద్ కూడా కనిపిస్తాడు. ఈ సాంగ్ చిత్రీకరించడానికి ముందు చిత్ర యూనిట్ రంభ పర్మిషన్ తీసుకున్నారట. ఎ.కె.ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై రామబ్రహ్మం సుంకర నిర్మాతగా సినిమా రూపొందుతోంది.




# తెలుగులో డబ్బింగ్ చెప్పుకోవాలనుంది!



నెట్‌ఫ్లిక్స్‌లో విడుదలైన వెబ్ సిరీస్ 'పిట్టకథలు'లో తన పాత్రకు శ్రుతీ హాసన్ స్వయంగా డబ్బింగ్ చెప్పారు. అయితే, ఇప్పటివరకూ నటించిన తెలుగు సినిమాల్లో పాత్రలకు డబ్బింగ్ చెప్పుకోలేదు. కానీ, తనకు తెలుగులో డబ్బింగ్ చెప్పుకోవాలని ఉందని శ్రుతీ హాసన్ అన్నారు. అలాగే, తాను తెలుగులో పాట పాడి చాలా రోజులైందనీ, అవకాశం వస్తే మళ్ళీ పాడాలని ఉందని ఆమె చెప్పుకొచ్చారు. "ఎక్స్-లైఫ్' (నాలుగు కథల సంకలనంగా రూపొందిన 'పిట్టకథలు'లో శ్రుతి నటించిన ఎపిసోడ్)లో నా పాత్రకు నేనే డబ్బింగ్ చెప్పాను. నేను తెలుగు డబ్బింగ్ చెప్పడం అదే తొలిసారి. ప్రేక్షకులకు నా గొంతు నచ్చడం చాలా సంతోషంగా ఉంది. భవిష్యత్తులో డబ్బింగ్ చెప్పుకోవాలని అనుకుంటున్నా" అని శ్రుతీ హాసన్ తెలిపారు. ప్రస్తుతం ప్రభాస్ సరసన 'సలార్' చిత్రంలో ఆమె నటిస్తున్నారు. అలాగే, అమెజాన్ ప్రైమ్ వీడియో కోసం రూపొందుతున్న ఓ వెబ్ సిరీస్ చేస్తున్నారు. త్వరలో ఓ మ్యూజిక్ సింగిల్ విడుదల చేయనున్నారు. ముంబైలో లాక్‌డౌన్ కారణంగా ప్రస్తుతం ఇంట్లో ఉంటున్న శ్రుతీ హాసన్, ఆ సాంగ్ మీద పని చేస్తున్నారు.




# తేజ సజ్జా 'ఇష్క్' విడుదల వాయిదా..



దేశ వ్యాప్తంగా కరోనా విజృంభిస్తుండడం.. రోజు రోజూకీ కోవిడ్ పాజిటివ్ కేసుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో.. ఏప్రిల్ 23న విడుదల కావాల్సిన ఇష్క్ చిత్రాన్ని వాయిదా వేస్తున్నట్లు మేకర్స్ ప్రకటించారు. దక్షినాదిలోని సుప్రసిద్ధ నిర్మాణ సంస్థల్లో ఒకటైన మెగా సూపర్ గుడ్ ఫిలిమ్స్ పతాకంపై.. తేజ సజ్జా, ప్రియా ప్రకాశ్ వారియర్ హీరోహీరోయిన్లుగా యస్.యస్. రాజుని దర్శకుడిగా పరిచయం చేస్తూ ఆర్.బి.చౌదరి సమర్పణలో ఎన్వీ ప్రసాద్, పారస్ జైన్, వాకాడ అంజన్ కుమార్ సంయుక్తంగా నిర్మిస్తున్న చిత్రం 'ఇష్క్'. ఏప్రిల్ 23న విడుదల కావాల్సిన ఈ చిత్రాన్ని వాయిదా వేస్తున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా చిత్ర నిర్మాతలు మాట్లాడుతూ.. "దేశ వ్యాప్తంగా కరోనా విజృంభిస్తున్న వేళ ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని రెండు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు తగిన మార్గ నిర్దేశకాలు విడుదల చేశాయి. అందులో భాగంగా ఏపీలో 50 శాతానికి థియేటర్ల ఆక్యుపెన్సి తగ్గించడం, తెలంగాణలో రాత్రి పూట కర్ఫ్యూ విధించడం జరిగింది. ఇలాంటి టైమ్‌లో సినిమా రిలీజ్ చేయడం కరెక్ట్ కాదని భావించి ఈ నెల 23న విడుదల కావాల్సిన 'ఇష్క్' చిత్రాన్ని వాయిదా వేస్తున్నాం. పరిస్థితులన్నీ అనుకూలించిన తర్వాత కొత్త విడుదల తేదీని ప్రకటిస్తాం" అన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2, OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH.
PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY, 7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190